# తెలుగు జ్యోతి

## తెలుగు కళా సమితి ప్రచురణ

### దీపావళి ప్రత్యేక సంచిక : నవంబర్ - డిసెంబర్ 2020




గాన గంధర్వుడు
స్వర్గీయ
శ్రీ S.P. బాల సుబ్రహ్మణ్యం గారి
జ్ఞాపకార్థం

**Telugu Jyothi**
Nov - Dec 2020

A Literary Magazine from
**Telugu Fine Arts Society**

# తెలుగు కళా సమితి
# Telugu Fine Arts Society, Inc.

A tax exempt and not for profit corporation: Tax Id# 22-2534166

13 Julie Court, Somerset, NJ 08873: http://www.tfas.net



**Board of Trustees 2020-2022**

**President**
**Sreedevi Jagarlamudi**
13 Julie Court,
Somerset, NJ 08873
(732) 470-7055
*president@tfas.net*

**Vice President**
**Bindu Yalamanchili**
6 Bogart Dr,
Bridgewater, NJ 08807
(908) 240-3167
*vicepresident@tfas.net*

**Secretary**
**Usha Darisipudi**
24 Christian Drive
East Brunswick, NJ 08816
(732)718-4184
*secretary@tfas.net*

**Treasurer**
**Jyothi Gandi**
16 Parker Road
Edison, NJ 08820
(732) 208-9599
*treasurer@tfas.net*

**Membership Services**
**Srinivas Cheruvu**
(732) 447-6686
*membership@tfas.net*

**Cultural**
**Anuradha Para**
(201)312-5335
*events@tfas.net*

**IT Services**
**Anuradha Dasari**
(908) 907-1502
*it@tfas.net*

**Youth Services**
**Yasoda Dasika**
(908) 304-3710
*youth@tfas.net*

**Community Services**
**Ravi Annadanam**
(917) 355-5503
*community@tfas.net*

**Advisors**
**Anand Paluri**
**Sudhaker Rayapudi**
**Ram Kolluri**
**Dr. Janani Krishna**
**Hari Eppanapally**

**Telugu Jyothi**
**Vignan Kumar Utukuri**
Editor


**November 30,2020**

## అధ్యక్షురాలి కలం నుండి...



తెలుగు కళా సమితి సభ్యులకు మరియు ఆత్మీయులకు నమస్సుమాంజలి. ముందుగా మీ అందరికీ కాంతులు వెదజల్లే దీపావళి పండుగ శుభాకాంక్షలు.

మా కమిటీ బాధ్యతలు చేపట్టి అప్పుడే ఐదు నెలలు నిండింది. కానీ మనము ఇంకా Pandemic లోనే ఉన్నాము. ఈ కరోనా మహమ్మారి ఇంకా విలయతాండవం కొనసాగిస్తూనే ఉంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో అందరం కలిసి వేడుకలు చేసుకోలేకపోతున్నాము.

టెక్నాలజీ సాయంతో virtual world లో మనం కూడా భాగస్వామ్యులం అయ్యాము. ఈ virtual world ఆధారంగా ఇప్పటి వరకు మేముఈ క్రింది ప్రోగ్రామ్స్ నిర్వహించాము

- మొదటగా స్టూడెంట్స్ కి ఉపయోగపడే College Counseling మరియు Interactive Q&A with Student mentors తో నిర్వహించాము.
- F&H వీసా లకు సంబంధించి కొత్తగా వచ్చిన మార్పులను అందరికీ అర్థం కావడానికి Immigration seminar నిర్వహించాము.
- మామూలు టైములో వేసవిలో చక్కగా వనభోజనాలు అంటూ సమ్మర్ పిక్నిక్ ని చేసుకునే వాళ్ళము. కానీ ఈసారి దానికి బదులు వర్చువల్ లో ఆహ్లాదపు చిరుజల్లు అంటూ Summer Fun నిర్వహించాము.
- Health కి సంబంధించి ISHA వారితో కలిసి Yoga for Mental Health మరియు డాక్టర్ సునీత కనుమూరి గారితో staying healthy in pandemic కార్యక్రమాన్ని నిర్వహించాము.
- ఈ Pandemic time లో రంగస్థల నాటక కళాకారులని ఆదుకోడానికి మాకు తోచిన సహాయం చేద్దామని New York Telangana Telugu Association వారితో కలిసి సురభి వారిచే నవంబర్ 22nd, 2020 శ్రీకృష్ణతులాభారం నాటక ప్రదర్శన నిర్వహించాము. ఈ కార్యక్రమానికి మాతోపాటు కొందరు దాతలు (శ్రీయుతులు క్రోసూరి సునీత, అన్నదానం రవి, యడ్లపల్లి రామ్, పన్నల రఘు, చిల్లర మనోహర్, యలమంచిలి బిందు, భావరాజు మూర్తి, చిట్టి శర్మ, చెరువు శ్రీనివాస్, దేసు రావ్, ప్రభా రఘునాథన్, కటకం శ్రీనివాస్, బుర్రా రాజేశ్వరి, తాటి మాధవి, గేదెల దాము, డొక్కు మల్లిక్, డా. తగిరస, గంటి సత్యనారాయణ గార్లు) ముందుకు వచ్చి ఈ కళాకారులకు సహాయం అందించడంలో తమ వంతు కృషి చేశారు. మరొక్కసారి ఈ దాతలందరికీ మా తెలుగు కళా సమితి తరపున ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

దీపావళి సంబరాలను డిశంబరు 5న మీ ముందుకు తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నాము. ఈ virtual live వేడుకకు మీ అందరికీ ఇదే మా ఆహ్వానం. అలాగే దీపావళికి గాను తెలుగు కథలు, కవితలు మరియు వంటల పోటీలు నిర్వహించాము. విజేత లను దీపావళి వేడుకల్లో ప్రకటిస్తాము.

భవిష్యత్తులో మీకు నచ్చిన మీరు మెచ్చిన కార్యక్రమాలను అందించేందుకు మా శాయ శక్తులా కృషి చేస్థున్నాము.

మీ సహాయ సహకారాలే కొండంత అండగా భావిస్తూ ముందడుగు వేస్తున్నాము. మీ అభిప్రాయాలను మాకు తెలియజేస్తారని ఆశిస్తూ ..

మరొక్కసారి ఈ దీపావళి ప్రపంచానికి కొత్త కాంతులు నింపాలని... మనందరి ఆశలు ఫలించాలని కోరుకుంటూ..

మీ సేవలో
**జాగర్లమూడి శ్రీదేవి**
**అధ్యక్షురాలు**

# Telugu Fine Arts Society

## Board of Trustees : 2020 - 2022



Sreedevi Jagarlamudi
President



Bindu Yalamanchili
Vice President



Usha Darisipudi
Secretary



Jyothi Gandi
Treasurer



Anu Para
Cultural Chair



Anuradha Dasari
IT Chair



Yashoda Dasika
Youth Chair



Srinivas Cheruvu
Membership Chair



Ravi Annadanam
Community Chair

## Advisory Board



Anand Paluri
Chair



Ram Kolluri
Member



Sudhakar Rayapudi
Member



Dr. Janani Krishna
Member



Hari Eppanapally
Member

## Telugu Jyothi

Utukuri Vignana Kumar
Editor



# సంపాదకీయం

ఏ కొత్త మాట విన్నా ఏ గొప్ప వింత కన్నా, "మనవాళ్ళెప్పుడో చెప్పారా సంగతి" అని గప్పాలు కొట్టుకోవడం మనకొక అలవాటు. మహా కవి కాళి దాసు ఐదో శతాబ్దంలో వ్రాసిన మేఘ దూతం కూడా ఆ ఖాతాలో చేర్చచ్చునేమో.  నిజమా అలా ఎప్పటికన్నా సాధ్యమవుతుందా అని ఉవ్విళ్ళూరడం తప్ప మనం చేయగలిగిందేమీ లేకపోయింది శతాబ్దాలు శతాబ్దాలుగా. ఇలవేల్పు సినిమా లోని 'చల్లని రాజా ఓ చందమామా... ' అన్న అంజలీ నాగేశ్వర రావు పాట నిజానికి అటువంటి కలే కదా.  సమాచారాలూ ఉత్తారాలూ చేరడంలో మైలు రాళ్ళు: 1832 లో రైలు బళ్ళలో తపాలాలు, 1876 లో Graham Bell గారి టెలిఫోను, 1901 లో Marconi గారి టెలిగ్రాము, 1971 లో email, 1993 లో కాబోలు AOL Mail. రైలూ టెలిఫోనూ మేఘాల మీద లేవు నేల మీదే ఉంటాయని అభ్యంతరం చెప్పచ్చు గానీ, మాట వరసకి కలిపాను వాటిని కూడా. అంటే కాళిదాసు గారి ఊహాగానం నిజమవ్వటానికీ మన కలలు పండడానికీ దాదాపు1500 సంవత్సరాలు పట్టిందనమాట.

ఐతే అవన్నీ ఒకెత్తూ, ఏదీ ఓ పది పదకొండు నెలలనుంచీ బహుళ ప్రచారంలోకొచ్చిన Zoom, WhatsApp పూర్తిగా మఱో ఎత్తు. ప్రతి సమయం Zoom సమయం, ప్రతి సందేశం WhatsApp సందేశం. ఈ Covid 19 గనుక ఓ నాలుగైదు సంవత్సరాల క్రితం వచ్చుంటే, మన Work from Home ఎలా కుదిఱేదో కదా అనిపిస్తుంది. నిజంగా మేఘదూతలంటే ఇవే సుమా! నరక చతుర్దశి రోజునుంచి దీపావళి మర్నాటి  వఱకూ కలకత్తా నుంచి కాలిఫోర్నియా దాకా ఆస్ట్రేలియా నుంచి ఓస్లో దాకా చుట్టాలు పక్కాలు అందఱినుంచీ వాళ్ళ వాళ్ళ దీపావళి video లే WhatsApp ద్వారా, బృందగానాలే Zoom గుండా. మనం జఱుపుకున్న బాలూ గారి సంస్మరణ సభా అలాగే జఱిగిందీ, రేపు మన కళా సమితి దీపావళి కార్యక్రమం కూడా అలాగే జఱుగుతుంది.

పరుగులు పెట్టున్న మన సాంకేతిక ప్రగతితో  Holography ద్వారా 3D Video లు కూడా వచ్చేస్తాయేమో అతి దగ్గఱి భవిష్యత్తులో. వస్తాయని కలలు కంటూ వర్తమానానికి వచ్చేద్దాం.

నిజానికి వర్తమానం లోకొస్తే, ఈ 2020 సంవత్సర కాలం అతి భయంకరంగా గడిచింది. Covid 19 బారిన పడి ఇప్పటి దాకా పద్నాలుగు లక్షల మది శలభాలైపోయారు. అదొక ఎత్తైతే అతి కష్టమైన ప్రసవ వేదన పడింది యావద్దేశం, ఎన్నికలలో. మొత్తానికి ఈ మన పత్రిక వెలువడే సమయానికి Covid 19 vaccine తయారయిందన్న వార్తా, ఎన్నికల పోట్లాటలు పరిష్కారమవుతున్నాయన్న వార్తా రెండూ వచ్చాయి. 2021 శాంతివతంగా ఉంటుందని ఆశిద్దాం.

ఇక ఈ సంచిక విషయానికొస్తే మా దీపావళి పోటీకి ఎంతగానో స్పందించి ఎన్నెన్నో కథలూ కవితలూ పంపిన రచయితలందఱికీ కృతజ్ఞతలు. మొదలుపెట్టిన మూడు సంవత్సరాలగా ఏటేటా ప్రవర్ధమానమవుతూ వస్తున్నది ఈ పోటీ. కథలూ కవితలూ విరివిగా వచ్చినందున ప్రకటించినట్లుగా రెండు రెండు బహుమతులు కాకుండా, కథలకీ, కవితలకీ మూడు మూడు ($100, $60 & $40) బహుమతులివ్వడానికి నిశ్చయించారు, తెలుగు కళా సమితి వారు. ఈ సంచికలో మొదటి రెండు బహుమతుల రచనలూ వేస్తున్నాము. 2021 సంక్రాంతి సంచికలో మూడవ బహుమతి రచనలు రెండూ వేస్తాము.


## సంపాదక వర్గం

**ఊటుకూరి విజ్ఞాన్ కుమార్ (సంపాదకులు),  ఉప్పల అనంత సుధాకర్,**

**తాడేపల్లి కుమార్, లంకా వేంకట కృష్ణా రావ్,  బొగ్గవరపు లవకుశ, తిప్పాభొట్ల రవిశంకర్**

**తెలుగు కళా సమితి ప్రతినిధులు**

**దరిసిపూడి ఉష (ఉప-సంపాదకులు), దశిక యశోద, పారా అనురాధ**

# విషయ సూచిక


అధ్యక్షురాలి కలం నుండి 2

సంపాదకీయం 4

2020 దీపావళి పోటీల బహుమతుల వివరాలు 6

మామ కాని మామ – నోరి రాధిక 7

వసంతకోకిల – ఇందిరా రావు దువ్వూరి 8

నేను పరాజితుణ్ణి – వైద్యుల మధుకర్ 11

వెలిసిపోయిన పాత చీరలు – కుంతి 12

తెలుగు పాడుగు – ప్రభాకర మూర్తి 15

వైద్యుని తపన – డా. రమ్యశ్రీ 16

కరోనాకి వైద్యం – డా. రమ్యశ్రీ 16

ముసురు – దేవులపల్లి దుర్గా ప్రసాద్ 18

మిర్చీ బజ్జీ – బోగా మనోహర 20

మనీషి – గుండమరాజు శ్రీ శేష కల్యాణి 22

నేను ఒంటరిని కాను – పూర్ణిమ 27

శిలాకుసుమం – ఘాలి లలిత ప్రవల్లిక 27

శ్రీ కృష్ణ తులాభారం (TFAS Press Note) 29

అపర ధన్వంతరి – మోపిదేవి విజయగోపాల్ 31

TFAS Event Flyers

దీపావళి ధమాకా - 17 సురభి నాటక ప్రదర్శన - 28

Summer Fun Event - 22 Meditation for Mental Health 26


**Opinions expressed in this volume are those of the authors and not of TFAS.**

# 2020 దీపావళి పోటీలలో బహుమతుల వివరాలు

ముందుగా, మా పోటీలకి విరివిగా స్పందించి పోటీ జఋుపుతున్నఈ మూడో సంవత్సరంలో దాదాపు 150 రచనలు పంపిన రచయితలందఋికీ ధన్యవాదాలు. అందువలననే వాటినన్నిటినీ చదివి బహుమతులు నిర్ణయించడానికి మాకు ఎక్కువ సమయం కావల్సి వచ్చింది. ఇంత విరివిగా వచ్చాయి కాబట్టి తెలుగు కళా సమితి వారు, ప్రకటించినట్లుగా రెండు బదులు మూడు మూడు బహుమతులివ్వడానికి నిశ్చయించారు. బహుమతులు ఈ విధంగా ఉన్నాయి.

కవితలలో

- **మొదటి బహుమతి, $100** : నోరి రాధిక గారి "చందమామ" మీద అందమైన కవిత
- **రెండవ బహుమతి, $60** : వైద్యుల మధుకర్ గారి "నేను పరాజితుణ్ణి కాను" అన్న ఉత్తేజ పూరితమైన కవిత
- **మూడవ బహుమతి, $40** : పన్నాల రఘురాం గారి "న్యూయార్క్ - నాడు- నేడు - రేపు" అంటూ 'మన' New York మీద అందమైన కవిత

ఈ కవితల బహుమతుల నిర్ధారణలో మాకు చేయూత నిచ్చిన ప్రముఖ కవయిత్రి Dr. వైదేహి గారికి ధన్యవాదాలు.

కథలలో


- **మొదటి బహుమతి, $100** : దువ్వూరి ఇందిర గారి "వసంత కోకిల, ఒక క్షోభిత కోకిల గానం"
- **రెండవ బహుమతి, $60** : కుంతి గారి "వెలిసి పోయిన పాత చీర", కోవిడ్ 19 వాతావరణలో జీవత్యాగమే శరణ్యమైన ఒక పేద కథ
- **మూడవ బహుమతి, $40** : చెన్నూరి రామ మూర్తి గారి "సంపూర్ణ చంద్రోదయం", ఎంత కవిచంద్రుడికైనా సూర్య రశ్మి, సహాయం లేనిదే పూర్ణమి లేదని చెప్పే కథ

వంటకాలలో

- బోగా మనోహర గారికి "Air Fryer తో చేసిన మిరపకాయ బజ్జీ" లకు **$25 Consolation Prize**

**సభ్యులందరికీ దీపావళి శుభాకాంక్షలు.**

**మహారాజ పోషకులు శ్రీమతి కొల్లూరి గిరిజ, శ్రీ కొల్లూరి రామ్ గార్లు**



## మామ కాని మామ

**నోరి రాధిక**

**(తెలుగు జ్యోతి కవితల పోటీలో ప్రధమ బహుమతి గ్రహీత)**

అల నీల గగనాల వెలిగేటి తెల్లని పువ్వు
ఇల నిలచినవారి మదిలో వలపులు రువ్వు

మేఘాల మాటున పొంచి చిలిపి నవ్వులు నవ్వేవు నువ్వు
మనసు మాటున దాగిన తలపులు బట్టబయలు చేసేవు నువ్వు

తగులా యీ జిలిబిలి చిలిపి చేష్టలు నీకు
తగని వలపుల మునగలు మాచేత వేయించబోకు

ఈ చోట ఆ చోట ఏచోటాయినా తిరిగేవు
ఈ మాట ఆ మాట ఏమాటైనా తిరిగేవు

నీ మౌన నగవులు ప్రేములలో కలిగించేను కోపాలు
నీ చల్లదనాలు వారిలో రగిలించేను వలపులు తాపాలు

ప్రేమికుల రారాజ ప్రేమ జంటల రేరాజ
వలపుల వలరాజ తలపుల రతిరాజ

రాజ కానీ రాజ రాజుల్లో రాజ రాజులందరికీ రాజ
చిరునవ్వుల రోజాలతో పరిమళాలు వెదజల్లు రోజ రోజ

చందనాల చల్లదనాలు కోపతాపాల వెచ్చదనాలు
జంటితేనెల తీయదనాలు వింతైన వగరులు సుంతైన చేదులు

ఇస్తావు మధురమైన అనుభవాలు తెస్తావు వింతైన తీయదనాలు
పెనవేస్తావు ఒకరితో ఒకరికి తీపి తీపి అనుబంధాలు

వెన్నెల, మల్లెలు, చల్లదనాలు, పరిమళాలు
కలలు, కళలు, ఘుమఘుమలు, గుసగుసలు

అన్నీ నీవిచ్చిన బహుమతులే! అవన్నీ మా వెచ్చని అనుభూతులే!
అందరూ మెచ్చిన, మా మనసులలో విచ్చుకున్న పున్నమి పువ్వులే!

నువ్వు లేనిదే వెన్నెల లేదు నువ్వు లేనిదే ప్రేమ లేదు
మామ కానీ మామ, నువ్వు లేనిదే మా మనుగడే లేదు




SIDDHENDRA KUCHIPUDI ART ACADEMY
FOUNDER AND ARTISTIC DIRECTOR: SWATHI ATLURI-GUNDAPUNEEDI
PHONE: 732-429-2948
EMAIL: SIDDHENDRAKUCHIPUDI@GMAIL.COM
WWW.SIDDHENDRAKUCHIPUDIARTACADEMY.COM
HTTPS://WWW.FACEBOOK.COM/SIDDHENDRAKUCHIPUDI

# వసంతకోకిల

**ఇందిరా రావు దువ్వూరి**
**(తెలుగు జ్యోతి కథల పోటీలో ప్రధమ బహుమతి గ్రహీత)**

ఆ రోజు రవీంద్ర భారతి కిటకిటలాడుతోంది. నంది అవార్డ్స్ ఇస్తున్నారని మహామహులంతా వస్తున్నారు. అన్నిటికంటే లతా మంగేష్కర్ , సుశీల, జానకి ల కోవలో పాడే "వసంతకోకిల" బిరుదు పొందిన గాయని కోకిల, మొదటిసారి స్టేజి మీద కనపడబోతుంది. తను ఆ మధ్య పాడిన సినిమాలోని సూపర్ హిట్ సాంగ్ కి బెస్ట్ సింగర్ గా అవార్డు అందుకోబోతోంది. కోకిల పాటే గాని మనిషి ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు. ఎక్కడికి ఏ అవార్డు ఫంక్షన్ కి రాదు. రికార్డింగ్ లో కూడా లోపల ఎవరు ఉండకుండా చూసుకుంటుందట. పూర్తిగా మొహం కనబడకుండా బట్ట చుట్టుకుని ఒక కళ్లు మాత్రమే కనపడేలా వస్తుందిట.తను పాడిన రికార్డ్స్ కానీ, సీడీలు మీద కానీ తన ఫోటో ఉండదు. ఈరోజు కోకిల వస్తోందని, తనని తప్పకుండా చూడొచ్చని అందరికీ చాలా ఉత్కంఠగా ఉంది. అందరికీ సస్పెన్స్ గా కూడా ఉంది. అందరికి ఎందుకు కనపడదు?? కారణం ఏమిటి?? అని. కార్యక్రమం మొదలైంది. ఎవరెవరో ప్రముఖులు వస్తున్నారు. కొన్ని డాన్సులు, పాటలు లాంటి సాంస్కృతిక కార్యక్రమాల తరువాత బహుమతి గ్రహీతలు ఒక్కొక్కరిని పిలుస్తున్నారు. అనేక మంది కళాకారులు బహుమతులను అందుకుంటున్నారు. కోకిల ఒక్క తెలుగులోనే కాక హింది, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో కూడా చాలా ప్రసిద్ధి చెందిన గాయకురాలు. ఈ భాషలన్నిటిలోనూ ఇంచుమించు గత నాలుగేళ్లగా ఆమె పాడిన పాటలన్నీ సూపర్హిట్ సాంగ్స్. ఆమె పాడిన పాటల రికార్డులు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. ఇంతలో ఇప్పుడు "బెస్ట్ సింగర్ అవార్డు గ్రహీత కుమారి కోకిల" అని పిలవగానే ఒక అమ్మాయి మొహానికి బట్ట కట్టుకొని కళ్ళు మాత్రమే కనపడేలా స్టేజి మీదకి వచ్చింది.

"మీ మొహం చూపించాలి!" "ప్లీజ్ షో యువర్ ఫేస్" అన్ని భాషల్లో హాల్లోంచి అరుపులు, కేకలు వినబడ్డాయి. బహుమతి అందుకున్న కోకిల సభాధ్యక్షులు దగ్గరికి వెళ్లి చిన్నగా ఏదో అడిగింది.. ముందు కొంచెం సంకోచించినా హాల్లో గొడవకి ఆయన కూడా, అందులో కోకిల గురించి విన్నాడు కాబట్టి సరేనని తల ఊపడం అందరికీ కనిపించింది. కోకిల నెమ్మదిగా మైక్ తీసుకుని స్టేజి మధ్యకు వచ్చింది.. సభను ఉద్దేశించి " సభకు నమస్కారం!! స్టేజి మీద ఆసీనులైన పెద్దలకు, టీవీలో వీక్షిస్తున్న ప్రేక్షకులకు, సభలో ఉన్న వారందరికీ నా నమస్కారాలు. ఈ అవార్డు ఇచ్చినందుకు ప్రభుత్వానికి, నన్ను సెలెక్ట్ చెసిన కమిటీ సభ్యులకు, ముఖ్యంగా నా అభిమానులైన మీ అందరికీ నా కృతజ్ఞతలు. మీ ఆదరణ, అభిమానం లేక పోతే నేను ఈనాడు ఇంతమంది మహామహుల మధ్య ఈ అవార్డు తీసుకునే యోగ్యత పొందే దానిని కాదు.

ఇంతలో హాల్లో మళ్లీ అరుపులు వినిపించాయి "మీ మొహం చూపించండి , మిమ్మల్ని చూడాలి మేము , అంటూ. కోకిల మళ్ళీ "ఒక్క నిమిషం! సభాధ్యక్షులు అనుమతితో ముందు నేను ఒక కథ చెప్పబోతున్నాను. ఈరోజు నేను ఎవరో, ఎలా ఉంటానో చూడాలన్న కుతూహలం మీకు వుందని నాకు తెలుసు. నేను నేనుగా మీ ముందుకు రావాలని, నేను ఎలా ఉంటానో మీ అందరికీ చూపాలనే మీ ముందుకు, ఈ సభకు రావడానికి ముఖ్య కారణం. కానీ ఒక్క పది నిమిషాలు ఓపిక పట్టండి. ముందు నా కథ వినండి." అంటూ తన కథ మొదలు పెట్టింది.

సునీత తల్లి విమల, తండ్రి నరసింహం ఒక మధ్యతరగతి కుటుంబీకులు. తండ్రి ఒక కెమికల్ ఫ్యాక్టరీలో సూపర్వైజర్. తల్లి అక్కడే వర్కర్. సునీత పుట్టిన తర్వాత తల్లి పుట్టింటికి వెళ్ళిన మూడు నెలల్లో తండ్రికి ఫ్యాక్టరీలో పనిచేసే సరోజ తో అక్రమ సంబంధం ఏర్పడింది. చంటి పిల్లతో తిరిగి వచ్చిన తల్లి భర్త లో మార్పు పసిగట్టింది. ముందు ఎందుకో అర్థం కాలేదు, కానీ తను కూడా మళ్లీ డ్యూటీ లో జాయిన్ అయ్యాక వాళ్ళిద్దరి మధ్య రహస్య సంకేతాలు చూసి సంగతి అర్థం అయ్యింది.. భర్త ను నిలదీసింది. ముందు బుకాయించాడు. అబద్ధాలు ఆడాడు. ఇంకెప్పుడు చెయ్యను అని పాప మీద ఒట్టు వేసాడు. పదిహేను రోజులకే మళ్ళీ మొదలు. సరోజ ని కూడా నిలదీసి అడిగింది విమల. "అవును మా ఇద్దరికీ ఒకరంటే ఒకరు ఇష్టం. తప్పేంటి ? దమ్ముంటే నీ భర్త ను అదుపులో పెట్టుకో" అని నోటికొచ్చినట్టు మాట్లాడింది సరోజ. నిజమే ! మన బంగారం మంచిదైతే ఈ గొడవలెందుకు? అనుకుంది విమల. అదిగో అప్పటినుండి గొడవలు ఎక్కువయ్యాయి. రోజు ఇద్దరి మధ్య వాగ్వివాదాలు, తల్లిని కొట్టడం వరకు వచ్చింది. మొదటిసారి దెబ్బలు తిన్న తల్లి నాలుగు రోజులు లేవ లేకపోయింది. అతను నెమ్మదిగా ఇంటికి రావడం మానేశాడు. ఈ ఆందోళనలో సరిగా పనిచేయడం లేదని తల్లిని ఉద్యోగం నుంచి తీసేసారు. తీసేసారు అనడం కన్నా తండ్రి తన తల్లిని వదిలించుకోవడానికి తీయించేశాడు అనడం ధర్మం. మొదట్లో ఇంటి అవసరాలకు ఇచ్చే డబ్బు కూడా ఇవ్వడం మానేశాడు. శారీరకంగా, మానసికంగా అలిసి పోయి ఒక రకంగా పిచ్చి పట్టినట్టు అయిపోయింది తల్లి. ఆ రోజు, ఆ దురదృష్టకరమైన రోజు, వేరొకరురి ద్వారా తనకు విడాకులు ఇవ్వడానికి, వాళ్ళిద్దరూ పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడుతున్నారని తెలిసింది తల్లి విమలకి. అతను తన సామాను తీసుకోవడానికి ఇంటికి వచ్చాడు. ఒక్కసారిగా అగ్నిపర్వతం బద్దలైంది.మీద పడి గట్టిగా అందిన చోటల్లా కర్రతో కొట్టేసింది. ఎలాగో తప్పించుకున్న అతనిని "నన్ను కాదని వేరే పెళ్లి ఎలా చేసుకుంటావు?? అని గట్టిగా అరిచింది. నరసింహం ఆమె నుంచి తప్పించుకుని ఎలాగో పారిపోయాడు. అతను సాయంత్రం చీకటి పడుతూండగా ఇంటికి వచ్చాడు. పొద్దున్నుండి తల్లీ కూతుళ్లు, తల్లి బాధ తోటి, కూతురు ఆకలితోటి నిశ్రాణ గా వున్నారు. తల్లి ఒడిలో కూతురు, గోడకానుకొని తల్లి, కళ్ళు మూసుకొని కూర్చుని ఉన్నారు. అప్పుడే ఆకలికి ఏడ్చి ఏడ్చి అలిసిపోయి తల్లి ఒడిలో

పడుకొని ఉంది సునీత. చీకట్లో ఒక్కసారిగా చేతిలో ఉన్న సీసా లోది ఆమె మొహం పైకి వేశాడు.లేవబోతున్న విమల మొహం భగ్గు మంది. చేతితో ఆ సీసాను తోయపోతుంటే ఆ అరుపుకి, ఆ కుదుపు కి అందులో ఉండే ద్రవం ఒడిలో ఉన్న పాప మొహం మీద పడింది. కెవ్వుమన్నారు తల్లీ కూతుళ్లు ఇద్దరు. పాప ఏడుపు విని పక్కింటి వాళ్ళు వచ్చేలాగా తండ్రి పారిపోయాడు అక్కడనుండి. వెంటనే హాస్పిటల్ కు తీసుకెళ్లారు గానీ జరగవలసిన ఘోరం జరిగిపోయింది. విమల కి సగభాగం, పాపకి మూడు వంతులు మొహం కాలిపోయింది. ఎలాగో బతికి బట్టకట్టారు. పోలీసులు తండ్రి నరసింహన్ని అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు,కానీ తండ్రి జైలుకు వెళ్లిన ఆరు నెలలకి తల్లి కూడా అన్ని విధాలా మానసిక క్షోభ అనుభవించి ఇంక భరించలేక ఆత్మహత్య చేసుకుంది. ఎవరో కనికరించి అనాధాశ్రమం లో చేర్చారు సునీతని. పక్కన ఉన్న చర్చ్ లోని నన్ మార్గరెట్ ఆమెని ఆదరించి తన సొంత ఖర్చుతో చదివించింది. ఏకసంతాగ్రాహి అయిన సునీత అన్నింటా ఫస్ట్. స్కాలర్ షిప్ తో చదువుకొని స్కూల్ ఫస్ట్, కాలేజీ ఫస్ట్. కానీ ఎక్కడికి వెళ్ళినా అవమానాలు. తన మొహం చూడగానే తన ముందే అసహ్యం తో మొహం తిప్పుకునేవారు. సునీత కి చిన్నప్పటి నుంచి అవమానాలు, అవహేళనలు ఎదుర్కొన్న ప్రతిసారి మనసు క్రుంగి పోయెది. ఎవరెన్ని మాటలంటున్నా తనేమిటో నిరూపించుకోవాలని రాత్రింబవళ్లు కష్టపడి చదివి అన్నింటా ఫస్టు వచ్చేది. తోటి విద్యార్థులు, లెక్చరర్స్, ఎప్పుడూ ఎవరో ఒకరు హేళన చేస్తుంటే ఎన్నాళ్ళు ఈ బతుకు ఈడ్చడం, చనిపోవడం బెటర్ అని ఎన్నోసార్లు అనుకుంది. కానీ ధైర్యం చాలలేదు. భగవంతుడు ఇచ్చిన మరొక గొప్ప వరం సునీతకి అందమైన కంఠం. చర్చిలో ఎప్పుడూ తనని ప్రేయర్ సాంగ్ పాడమని మార్గరెట్ ప్రోత్సహిస్తూ ఉండేది.

కూనిరాగం తీస్తూ ఆలోచిస్తున్న సునీత కి ఒక వెలుగు వెలిగింది. అవును!! తను అలా ఎందుకు చేయకూడదు? అనుకుంది. చిన్నప్పటినుండీ తనని చర్చ్ లో పాడనిస్తున్నారు అంటే తన గొంతు బాగున్నట్టే కదా, తన ఆ విధంగా ఎందుకు ప్రయత్నం చేయకూడదు? అనుకుంది. తన మొహం బావుండదు కానీ తన గొంతు బ్రహ్మాండంగా ఉంటుంది కదా? ఎందుకు ప్రయత్నించకూడదు? అనుకుంది. ఆ రోజు నుండి సంగీతం వైపు దృష్టి పెట్టింది. ఆన్లైన్ సంగీతం క్లాసెస్ కి కట్టింది. మొహం పూర్తిగా కనిపించకుండా సంగీత పాఠాలు నేర్చుకుంది. నేర్పిన సంగీతం టీచరు మామూలుకన్నా ఎక్కువ డబ్బులు వస్తున్నాయని ఇవన్నీ పట్టించుకోలేదు. అకుంఠిత దీక్షతో రాత్రింబవళ్ళు కృషి చేసి ఒక స్థాయికి వచ్చింది. ఒకరోజు ఒక న్యూస్ పేపర్ అడ్వర్టైజ్మెంట్ సునీత దృష్టిని ఆకర్షించింది. వాళ్ళు ప్రారంభించే కొత్త సినిమా అంతా కొత్తవాళ్లే, డైరెక్టర్, నటులు,సహా నటులు, సింగర్లు కూడా కొత్త వాళ్లు కావాలని ప్రకటన ఇచ్చారు. ముందు గా ఒక క్యాసెట్ లో ఒక పాట రికార్డ్ చేసి పంపించామన్నారు. తను కూడా అప్లై చేసి వాళ్ళ ని అడిగిన విధంగా క్యాసెట్ పంపించింది. ఒక వారం రోజుల తర్వాత రికార్డింగ్ థియేటర్ కి రమ్మన్నారు. మొహం కనపడకుండా వీలైనంత కవర్ చేసుకొని వెళ్ళింది. రికార్డింగ్ రూమ్ కి వెళ్ళాక కర్చీఫ్ తీసి పాట మొదలుపెట్టగానే పిన్ డ్రాప్ సైలెన్స్ అయిపోయారు. కానీ "ఆమె మొహం?" ఒక్కసారి ఆలోచనలో పడ్డాడు కొత్త డైరెక్టర్. కానీ ఎంత మధురం గా పాడుతోంది?? ఎలా ? సరే!! బాగా ఆలోచించి పాటే గాని మనిషి కనపడదు కదా! అనుకొని వెంటనే సెలెక్ట్ చేశాడు.

సెలెక్ట్ అయ్యాను అని తెలియగానే తన పేరు కోకిల గా మార్చుకుంది.

మ్యూజికల్ హిట్ గా పేరు తెచ్చుకున్న ఆ సినిమాలో కోకిల పేరు ఒక్కసారిగా ఆకాశానికి అంటింది. కానీ తను ఎలా ఉంటుందో ఎవరికి తెలియదు. వరుసగా తర్వాత వచ్చిన సీడీలు, సినిమాలు అన్ని సూపర్ హిట్లే. ఎవరో "కోకిల ట. పేరుకు తగ్గట్టు గాత్రం" అని అనుకున్నారు అందరు. అంత వరకు తను కథను చెప్తూ కొంచెం ఆగి మళ్ళీ మొదలు పెట్టింది. "నా పాట ను అందరూ పొగుడుతూ ఉంటే కొంచెం ప్రలోభానికి లోనయ్యాను, అందరి ముందు నా రూపంతో వచ్చెయాలని, కానీ చూశాక!! మళ్ళీ నన్ను నా మొహం చూసి నిరాకరిస్తే? అమ్మో! ప్రేక్షకుల అభిమానానికి బాగా అలవాటు పడిపోయాను. ఒకప్పుడు నన్ను హేళన చేసినవారు నన్ను పొగుడుతూ ఉంటే, ఆ సంతోషం, ఆనందం మాటల్లో చెప్పలేను. ఈ సభాముఖంగా మీ అందరికీ చెప్పబోయేది, ప్రార్థించేది, ఒకటే.. నాలాంటి, అందులో ఇలాంటి ఏసిడ్ విక్టిమ్ లు ఎందరో? వారిని అసహ్యించుకోకండి.

ఆఖరి మాటలు అంటూ తన మొహానికి ఉన్న బట్ట తీసేసింది. "అబ్బా!! బాబోయ్?! ఓ మైగాడ్!!" ఒక్క సారిగా సభలో కలకలం రేగింది. రెండు చేతులు జోడించి కోకిల "నాకు తెలుసు, మీరు ఎలా రియాక్ట్ అవుతారో, కానీ నాకు పుట్టుకతో వచ్చిన లోపం కాదు ఇది. నా కన్న తండ్రి చేసిన దురాగతం ఇది. భగవంతుడు ఎందుకు నాకు ఇలాంటి పనిష్మెంట్ ఇచ్చాడో తెలియదు. ఈ మొహంతో అనేక సంవత్సరాలు నానారకాలుగా అసహ్యించుకోవడం, చీదరించుకోవటం లాంటి వాటిని అనుభవించాను, కానీ ఇది నా తప్పా?? ఇందులో నా పాత్ర ఎంత?? ఒక్కరంటే ఒక్కరు కూడా అలా ఆలోచించలేదు. అందరూ నా మొహం చూడగానే చూపు తిప్పుకున్న వారే. చాలా సార్లు ఆత్మహత్య చేసుకుందామని అనుకున్నాను. బతికి ఎవరిని ఉద్ధరించాలి అనుకున్నాను.కానీ ఎక్కడో చదివాను అన్ని దారులూ మూసుకుపోయాయి అనుకున్నప్పుడు భగవంతుడు ఎక్కడో ఒక మూల ఒక చిన్నపాటి వెలుతురు చూపిస్తాడని. ఆ వెలుతురు నాకు నా కంఠం రూపంలో ఇచ్చాడు.అనుకోకుండా ఒకరోజు చేసిన హమ్మింగ్ నా జీవితాన్ని మార్చింది. మళ్ళీ నాలో జీవించాలనే ఆశలు రేకెత్తించింది. మొదట్లో ఈ మొహం తోనే పాడుదాం అనుకున్నాను కానీ నన్ను చూడగానే కనీసం వాయిస్ టెస్ట్ కి కూడా పిలవకుండానే నా పాట, నా గొంతు పనికిరాదన్నారు. అందుకని ముసుగేసుకొని, అంతా కవర్ చేసుకొని, కళ్లు మాత్రమే కనపడేలా వెళ్లి ప్రయత్నించాను. వసంతం

లో మావి చివుళ్ళు తింటూ తన గాన మాధుర్యాన్ని మనకి అందించే కోయిల ఆ కొమ్మల్లో దాగుంటుంది ఎవరికి కనపడకుండా!!తన తీయని రాగ మాధుర్యాన్ని మనకి వినిపిస్తుంది కానీ తను కనిపించదు. బహుశా ఆ నలుపు రంగు ని అసహ్యించు కుంటామనేమో!! ఆ కోయిలే నాకు ఆదర్శం.అందుకే నా పేరు కోకిల గా మార్పించుకున్నాను..నా కంఠమో కానీ నేను ఎవ్వరికీ కనపడదల్చుకోలేదు. రాను రాను అందరికీ నేను ఒక మిస్టరీగా మారాను నాలాంటి అభాగ్యునులు ఎందరో. వారిని అసహ్యించుకోకండి. ఈ విషయం లో ఈషణ్మాత్రం మాత్రం జాలి అయినా చూపండి. దానికి ఖర్చు లేదుగా?? ఎవరిలో ఏ టాలెంట్ ఉందో?? వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు కల్పించకండి!! "For Ever Yours"" అనే ఒక సేవా సంస్థను స్థాపించి, ముఖ్యంగా ఇలాంటి దుర్ఘటనలు జరిగిన వారికి సమయానికి తగిన సహాయం అందించడం, ఆ అమ్మాయిలను ఆదుకోవడం, మా సంస్థ ఉద్దేశం. వారికి కావలసిన రక్షణ, ఆసరా కలిగించడం మా ధ్యేయం. ఇన్నాళ్లు దాన్ని నా పేరు పైకి రాకుండా నడుపుతున్నాను, ఈ రోజు మీ అందరి ముందు ధైర్యంగా ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాను. మరోసారి నన్ను చూశాక కూడా, ఇదివరకులాగే నన్ను, నా పాటనీ ఆదరిస్తారని, అభిమానిస్తారని, ఆశిస్తూ, మీ అందరి దగ్గర సెలవు తీసుకుంటున్నాను. ఈ అవకాశం నాకు కల్పించిన సభాధ్యక్షునికి, ఇంత ఓపికగా నా కథను విన్న మీ అందరికీ నా కృతజ్ఞతాభివందనాలు!!" అంది కోకిల.

ఒక్కసారిగా సభలో మౌనం వీడి, అందరూ లేచి నిలబడి గట్టిగా ఆపకుండా గంటసేపు చప్పట్లు కొట్టారు. కోకిల అందమైన "వసంత కోకిల" అని అనిపించింది అందరికీ!!



**సభ్యులందరికీ దీపావళి శుభాకాంక్షలు.**

శ్రీమతి పుష్ప,
శ్రీ మధు అన్నా
(TFAS Past VP)

# నేను పరాజితుణ్ణి

వైద్యుల మధుకర్
(తెలుగు జ్యోతి కవితల  పోటీలో ద్వితీయ బహుమతి గ్రహీత)

ఓటమి అంచున నిలబడి
గెలుపుకోసం ఆరాటపడుతున్న వాణ్ణి
నూరు ఓటములు అనుభవించునోణ్ణి
నూటొకకసారి కూడా గెలుస్తానని
పోటీలో నిలిచినోణ్ణి
నేను పరాజితుణ్ణి కాను

అవమానాలు అనుమానాలు నాకేం కొత్తకాదు
ఒక్క గెలుపుకోసం మరో నూరు సార్లు
ఓడిపోవడానికి సిద్ధపడినోణ్ణి
ఓటమి ముంగిట నిలబడి
గెలుపు కోసం తపిస్తున్నోణ్ణి
నేను పరాజితున్ని కాను

గెలుపు పయనంలో
అలుపెరుగని బాటసారిని
ఓటమనే చీకటిలో వెలుగుకోసం
వెతికే అన్వేషకుణ్ణి
ఓటమైన గెలుపైన ఆగని పయనాన్ని
నేను పరాజితుణ్ణి కాను

గెలుపుకోసం ఒకరి పంచన చేరే
పరాన్న జీవిని కాను
ఓటమిని జయించడం కోసం వంచన చేసే
ఊసరవెల్లిని కాను
ఆత్మస్థైర్యమే ఆయుధమైన గుండె నిబ్బరాన్ని
నేను పరాజితుణ్ణి కాను

ఓటమైనా గెలుపైనా ఆత్మాభిమాన్ని
తాకట్టుపెట్టలేని సామాన్యుణ్ణి
ఆశలను ఆశయాలను హృదయాంతరాల్లో
దాసుకున్న మౌనాన్ని
సముద్రగర్భమంత సహనం గల సునామిని.




# వెలిసిపోయిన పాత చీరలు

## కుంతి

## (తెలుగు జ్యోతి కథల పోటీలో ద్వితీయ బహుమతి గ్రహీత)

"అక్కా! ఎవరితోనో ఫోన్ లో గట్టి గట్టిగ మాట్లాడుతున్నవు"అప్పుడే వసారాలో బట్టలు ఆరేసి చేతులు తుడుచుకుంటూ వచ్చిన శారద, పద్మక్కను అడిగింది అంగణంలో కూర్చుంటూ

"ఇంకెవరితోటి మీ బావ తోటి"

"ఏమైంది"

"నెల రోజులైంది పట్నం పోయి. అక్కడ తాగుడులు, పేకాటలు. ఈ నెలల లక్ష రూపాయలు ఖర్చు అయిన యట. ఇదిట్ల ఉంటే ,చింకీ,పింకీలు యాభైవేలు పెట్టి మళ్ళీ బట్టలు కొనుక్కొచ్చుకున్నరట. పాయిన నెలనే ఇద్దరు స్కూటీలు కొనుక్కున్నారు.వీళ్ల సంగతి యేందో అర్ధమయితలేదు"

"మీ మామ మస్తు సంపాయించి పోయిండు.ఇంక నీ మన్మలు మన్మరాళ్ళు తిన్న తరగని ఆస్తి నీది,ఎందుకంత పరేషాన్ అయితవు.పిల్లలు ,బావా లైఫ్ ఎంజాయి చేస్తున్నరు, చేయనియ్యరాదు. నీ మరిదికూడా గంతె.నాపిల్లలు కూడ గంతె. మనమే ఇట్లుంటము" అన్నది శారద

ఆ యింటిలో పనిచేసే వీరన్న యింటి వరండాలో కూర్చొని వీళ్ళ సంభాషణ ఆసక్తిగా వింటున్నాడు .

ఇంతలో గేట్ చప్పుడయింది. అందరూ అటుకేసి చూసారు.

ఆ ఊరి పురోహితుడు, ఆ ఊరి దుర్గా దేవి పూజారి శ్రీనివాస శర్మ గేటు తీసుకొని లోపలికి వచ్చాడు.వీరన్న వెళ్ళి" రా! సీనయ్యరా!" అంటూ లోపలికి పిలిచాడు.

శ్రీనివాస శర్మ, వీరన్నలు అదే ఊరిలో ఉన్న ప్రాధమిక పాఠశాలలోకలిసి చదువుకున్నారు.అనాటి నుండి వారిద్దరూ మంచి మిత్రులు. అయిదవ తరగతి పూర్తి అయినాక శ్రీనివాస శర్మ పక్కన ఉన్న మండలం పాఠశాలకు వెళ్ళి పదవతరగతి వరకు చదువుకొన్నాడు. తల్లీ, తండ్రులు అకాలమరణం చెందడంతో, ఆ ఊరి లోనే వారసత్వంగా వచ్చిన గుడిలో పూజారి గా ఉంటూ అదే ఊళ్ళో పౌరోహిత్యం చేసుకుంటున్నాడు. వీరన్న ఐదవతరగతి చదవగానే అతని తండ్రి కొమరన్న తాను పని చేసే రాజేశ్వర్ రావు దగ్గర పాలేరుగా పనిలోకి కుదిర్చాడు. రాజేశ్వర్ రావు చనిపోయిన తరువాత, తండ్రి చేసిన అప్పులు తీర్చడానికి రాజేశ్వర్ రావు కొడుకు రమేశ్ రావు దగ్గర వీరన్న పనిచేస్తూ ఉండి పోయాడు.

శ్రీనివాసస్ శర్మ తండ్రి శివరామశర్మ విలువలున్న వాడు. సంప్రదాయస్తుడైనా మానవత్వానికి పట్టం కట్టే వాడు. వీరన్న చిన్నతనంలో ఉండగా ఎపుడైనా శ్రీనివాస శర్మ తోపాటు గుడికి వెళితే వీరన్న చేతిలో యేపండో ప్రసాదమో పెట్టే వాడు. ప్రేమగా చూసేవాడు. ఉత్సవాలు, ప్రత్యేక పూజలు జరిగే రోజుల్లో వీరన్న తండ్రి కొమరన్నకు ఆయన కుటుంబానికి అక్కడే భోజనాలు పెట్టేవాడు. కొమరన్న, శివరామ శర్మ లమధ్య తెలియని ఆత్మీయ బంధం ఉండేది. అదే వారి పిల్లలైన వీరన్న, శ్రీనివాస శర్మల మధ్య కొనసాగుతుంది. శివరామ శర్మ అమ్మవారికి పెట్టిన నై వేద్యం ఎంతో కమ్మగా ఉండేది. ఆ నైవేద్యం పరిమళం కంటే మించి శివరామ శర్మ కుటుంబం యొక్క ఆత్మీయ పరిమళం ఇప్పటికీ వీరన్నకు గుర్తున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీనివాస శర్మ మరియు వీరన్నల మధ్య ఉన్న చిన్న నాటి స్నేహబంధాన్ని వారి మధ్య ఉన్న కులఖడ్గం త్రుంచలేకపోయింది.

శ్రీనివాస శర్మను చూసిన పద్మమ్మ "ఏంది పంతులు! ఏమి సంగతిఎటో వచ్చినవు" అన్నది కూర్చోవడానికి కుర్చీ చూపిస్తూ. అతడు గుడి నుండి తెచ్చిన కుంకుమ, పసుపులు పద్మమ్మ చేతిలో పెడుతూ, తానూ కూర్చున్నాడు.

"మీరు శారదమ్మను తోలుక రావడానికి పోయినప్పటి నుండి ఈ రోజు వరకు , రోజు మీ కోసం పోతున్నడమ్మ." అన్నాడు వీరన్న

"ఏమి సంగతి పంతులు"అన్నది పద్మమ్మ

"ఏముంటది అమ్మా! మీకు తెలియనిది ఏముంది. రామేశ్వర్రావు గారు పోయినప్పటి నుండి గుడిమాన్యం మాకు రావడం లేదు. ఆయన ఉన్నప్పుడు ధూపదీపాలకు నెలకింత ఇచ్చేవాడు. ఇపుడు అదీలేదు. అయినా ఇన్ని నాళ్ళు ఎట్లనో గడిపినం. కాని రక్కసి కాలం వచ్చింది. ఆరు నెలల నుండి గుడి కి భక్తులు రావడం లేదు. ఊళ్ళో ఎవరూ పూజలకు పిలవడంలేదు. ఆరు నెలల కిందటి వరకు అపుడో ఇపుడో గుడికి వచ్చే భక్తులతో అమ్మవారికి దీపం, ధూపం, నైవేద్యం గడిచేది. మాకూ ఒకపూట గడిచేది. ప్రస్తుతం అయితే మా తిండి అటుంచి దేవతా నైవేద్యానికి కూడ కటకట పడుతున్నాం" అన్నాడు శ్రీనివాస శర్మ బాధగా

ఆ మాటలు విన్న పద్మమ్మ అతను ఎందుకు వచ్చాడో, యేమి యేమి అడగబోతున్నాడో ఊహించుకొని,

"యేమి చెప్పమంటవు పంతులూ!మాపరిస్థితి కూడ గట్లనే ఉన్నది. కరోనా వచ్చుడేందో కాని రమేష్ సార్ దంద అంత నాశనమైంది. ఆయన నడిపే చిట్టెల దందల, బిజినెస్ల లాస్ వచ్చింది. పండిన పంట,వ్యవసాయానికి చేసిన అప్పులతో సరిపోయింది . మాపరిస్థితి మీ కన్న అద్వాన్నంగ ఉంది" అన్నది.

"పండిన పంట అంత పైసలు చేసుకొని పేకాడితే, తాగి తందనాలాడితే పైసలు యాడికేంచి ఉంటయి" అనుకున్నాడు వీరన్న మనసులో

శ్రీనివాసశర్మ ఆమె మాటలకు కాసేపు మౌనంగా ఉన్నాడు. కాని అతని ప్రస్తుత పరిస్థితి మౌనంగా, గంభీరంగా, స్వాభిమానంగా ఉండనిచ్చేట్లు లేదు.

"మీరే ఇట్ల అంటే ఎట్ల? గుడి మాన్యాన్ని చూసేది మీరే. గుడికి ధర్మ కర్తలు కూడామీరే. మీరే అమ్మవారిని, అమ్మవారిని నమ్ముకున్న నాలాంటి వారిని వదిలేస్తే మా పరిస్థితి యేమికాను" అన్నాడు

"అన్ని మాటలెందుకు పంతులు.మేము చేస్తున్నచిట్టీల దందాల దివాల తీసింది.చేతిలపైసలు ఆడతలేవు.లేకుంటే మాకు ధర్మం దెల్వదా?న్యాయం దెల్వదా?"

ఆ మాటలు విని ఇంకా ఆమెతో యేమి మాట్లాడాలో తోచక అక్కడే కూర్చుండి పోయాడు.

మళ్ళీ అతనే "అసలు విషయం చెపుతున్నాను అమ్మా! మన ఊళ్ళ ఈ మధ్యచిల్లర దొంగతనాలు ఎక్కువయ్యాయని మీకు తెలుసు కదా. అమ్మ వారికున్న వెండి నగలు, పాత్రలు ఎవడైన ఎత్తుకుపోతాడేమోనని నేను నా భార్య రోజు అమ్మ వారి గుడి లోనే పడుకుంటున్నాం. మూడు రోజుల కింద మా ఇంటిలో ఎవడో దొంగపడ్డాడు. బట్టలు, బాసన్లు, ఉప్పులు, పప్పుల దగ్గరనుండి అన్నిసర్దుకు పోయిండు. దుర్గమ్మ పాదాల సాక్షిగ చెపుతున్నాను, మూడు రోజుల నుండి సరిగ్గ తిండి కూడ లేదు. తిండి లేక పోవడమే కాదు .మారు బట్ట కూడ లేదు. స్నానం చేసి ఒంటి మీది గుడ్డను పిండుకొని అది ఎండే వరకు తుండుతోటే ఉంటున్నను. నా భార్య పరిస్థితి ఇంకా కష్టంగా ఉన్నది.. ఆమె స్నానంచేసి విడిచిన బట్ట ఎండేవరకు చింకి పాత కట్టుకొని వంటిట్లనే ఉంటున్నది" అన్నాడు, అవమాన భారంతో పాటుగా గుండెనుండి తన్నుకు వచ్చిన కళ్ళనీళ్లతో.

అతని మాటలు వినగానే తన చిన్ననాటి స్నేహితునికి వచ్చిన కష్టం చూసి వీరన్న కళ్ళల్లో కూడా నీళ్ళు నిండాయి.

"అయ్యో!అంత పని అయిందా? మాకు తెల్వనే తెల్వదు"అన్నది

"ఔను అమ్మా! మా దరిద్రానికితోడు పులి మీద పుట్రలా ఇది వచ్చిపడింది" అంటూ ఆమె ముఖంలోకి, యేదైనా సాయం చేస్తుందేమో అన్నట్లుగా చూసాడు.

అమె అతడిని పట్టించుకోకుండా "శారదా! రాత్రికి ఇంత ఉప్పుడు పిండి చెయ్యి" అన్నది

శర్మ కదలకుండా అక్కడే కూర్చున్నాడు

వీరన్న తన యజమాని భార్యలో ఇటువంటి సందర్భం లోనైనా మానవత్వం కనబడుతుండేమోనని ఆశగా ఎదురు చూస్తున్నాడు

"శారదమ్మ భక్తి టీవీ పెట్టు. కరోనా రాకుండ రోజు ఏవో పూజలు చూపిస్తున్నరు" అన్నది పద్మమ్మ శ్రీనివాస శర్మ వైపు చూడకుండా.

ఆమె తనను గురించి పట్టించుకునేటట్లు లేదని తెలిసినా, తన ఆత్మాభిమానాన్ని పక్కకు పెట్టి, వసారాలో ఆరవేసిన ధోవతులు, చీరల వంక చూస్తూ, అతి కష్టం మీద నోరు పెగుల్చుకొని, "అమ్మా! ఒక్క చిన్న సాయం చేయండి,కనీసం రెండు పాత చీరలు అయినా ఇయ్యండి"అన్నాడు.

"అయ్యో పంతులు !ఎంత మాట అన్నవు.మీరు బాపనోళ్ళు.పెద్ద కులపోళ్ళు.మేము కట్టిన చీరలు మీకిస్తే మాకు పాపం తగలదా?" అన్నది.

అమె అలా అనేసరికి , తనమీద, తన కులం మీద అసహ్యం పుట్టి, మెల్లగా అక్కడి నుండి లేచి గేటు తీసుకొని బయటికి వచ్చాడు. అతని వెంట వీరన్న కూడా వచ్చాడు ఇద్దరూ మౌనంగా వీధి చివర ఉన్న గుడి దాకా వచ్చారు. వీరన్న గుడి వైపు చూసాడు. ఆ రోజు శుక్రవారం కావడంతో సీనయ్య అమ్మవారిని చక్కగా అలంకరించినట్లున్నాడు. గ్రిల్స్ వేసిన గర్భ గుడిలో నుండి అమ్మవారు చక్కగా దర్శనం ఇస్తుంది. "ఉన్నంతలో అమ్మవారికి యే లోటు చేయడు"అని అనుకున్నాడు మనసులో

గుడి పక్కన చెఱువు ఉంది. ఆ చెఱువును చూడాగానే, ఇంటర్ మీడియట్ లో మంచిస్టేట్ ర్యాంక్ సాధించి, యే కోచింగ్ లేకుండా ఎమ్ సెట్ లో కూడా మంచి రాం క్ సాధించినా మెడిసిన్ లో సీట్ రాకపోవడం తో కొన్ని నెలల కిందట బలవన్మరణం పొందిన సీనయ్య కొడుకు అచ్యుతం గుర్తుకు వచ్చాడు. చెఱువు గట్టు పైన అసహాయంగా కూలబడిన సీనయ్య పక్కన కూర్చున్నాడు .

"సీనయ్య! నీ పరిస్థితి చూస్తే నాకు గుండె తరుక్కు పోతుంది. తెల్ల కార్డు ఉండబట్టి, రేషన్ సామాన్ సమయానికి రాబట్టి, మాకుల సంఘాలు నెలకు కొన్నిపైసలు మాకు ఇయ్యబట్టి నా బతుకు నడుస్తున్నది లేకుంటే నా పరిస్థితి కూడ నీలాగే ఉండేది. నీకు తెల్వనిదేముంది? ఇన్ని సంవత్సరాల నుండి ఈయన దగ్గర పనిచేస్తున్న అప్పు తీరుత లేదు. ఆకలి తీరుతలేదు. చిన్న నాటి నుండి నీవు నా దోస్తువు. ఇదిగో నా దగ్గర ఒక వంద రూపాయలున్నయి. తీసుకో. కాదనకు" అన్నాడు.

శర్మ వీరన్న చేతులు పట్టుకొని, "వీరన్న! నీది పెద్ద మనసని నాకు తెలుసు. నాకు కష్టం వస్తే నన్ను ఇంటి దాకా రానిచ్చి, నాకు లేదు అని చెపుతారు.అదే నీకు కష్టం వస్తే కనీసం నిన్ను ఇంటిలోకి కూడా రానివ్వరు. ఆ డబ్బులు నీ దగ్గర ఉంచుకో. నేనే యేదైన

ఆలోచించుకుంటాను" అంటూ అక్కడి నుండి లేచి అతనికి వీడుకోలు చెప్పి ఇంటి వైపు వెళ్ళాడు.

★★★★★★★★

ఏదో అలికిడికి శర్మకు మెలకువ వచ్చింది.భార్య దూరంగ వెళ్ళి మూలకు పడుకొని వెక్కి వెక్కి యేడుస్తున్నది. ఇంటిలో దొంగ పడినప్పటి నుండి వాళ్ళు గుడిలో కాక ఇంటిలోనే పడుకుంటున్నారు. లేచాడు. లైట్ వేసాడు. అర్థమైంది.భార్యకు నెలసరి వచ్చినట్లుంది. చీర తడిసింది. ఒక పక్క చలి, మరొక పక్క ఉన్న ఒక్క చీర కూడా అసహ్యంగా తయారయింది. ఆమెతో ఏమి మాట్లాడాలో అర్థం కాలేదు. నిదుర చెదిరి పోయింది. సమయం చూసాడు. పన్నెండు అయింది. తలుపు దగ్గరికి వేసి బయటికి వచ్చి నడవడం ప్రారంభించాడు. వెన్నెల కాస్తుంది. కొంత దూరం నడిచాడు. రమేష్ దొర ఇంటికి దాకా వచ్చాడు. గేట్ తీసే ఉంది. ఆరు బయట వీరన్న గుర్రు పెట్టి నిదుర పోతున్నాడు. ఇంటికి ఉత్తరం వైపు కాంపౌండ్ వాల్ కు దగ్గర దండంపైన చీరలు ఆరి వేసి ఉన్నాయి. అతనికి తళుక్కున యేదో ఆలోచన వచ్చింది. నైతికచట్రం లో పెరిగిన అతని మనసు అతన్ని వారిస్తున్నా, అతడున్న బలహీన మైన పరిస్థితులు అతని మనసును ఓడించాయి. అటుకేసి నెమ్మదిగా నడిచాడు, గేట్ దాటాడు. దండెం ఉన్న వైపుకు చేరుకున్నాడు. అందులో వెలిసిపోయిన పాత చీరలు తీసుకున్నాడు. మళ్ళీ మెయిన్ గేట్ వైపునుండి వెళితే ఎవరి కంటనైనా పడతానేమో అనుకొని కాంపౌండ్ వాల్ ఎక్కి దూకి వెళ్ళిపోదామనుకున్నాడు. గోడపైన బలంగా చేతులు ఆనించి ఎక్కబోయాడు.

చేయి జారింది. కాలు అక్కడే ఉన్న ఇనుప రేకుల మీద పడింది.బాగా అలికిడి అయింది.. ఆ శబ్దానికి వీరన్న లేచాడు. ఇంటిలో ఉన్న పద్మమ్మ లేచి,తలుపు తీసుకొని బయటికి వచ్చింది. బయట లైట్ వేస్తూ," ఒరేయ్! వీరన్న ఏందో చప్పుడవుతుంది చూడు" అన్నది.

ఈ అలజడికి భయపడిన శర్మ అతి కష్టం మీద మళ్ళీ గోడ ఎక్కి అవతలి వైపుకు దూకాడు,కాని అక్కడ బాగా పెరిగిన తుమ్మ చెట్లు ఉన్న చిన్న మురికి కాలువ ఉండడంతో, చెట్లను ఒరుసుకుంటూ కాలువలో పడ్డాడు. చేతులకు కాళ్ళకు ముళ్ళు గుచ్చుకున్నాయి, ఒంటి నిండా మురికి అంటింది.

వీరన్న అలికిడి వచ్చిన వైపు వచ్చి, ఎవరో గోడ ఎక్కడం గమనించి వచ్చిన వాడు దొంగ అనుకొని వెంటనే గోడ ఎక్కి తానూ అవతలి వైపుకు దూకాడు. అక్కడ సీనయ్యను చూసి వీరన్న ఒక్కసారిగా నిర్ఘాంతపోయాడు.

సీనయ్యను ఆపరిస్థితిలో చూసిన వీరన్న,అతికష్టంగా " సీనయ్య! యేమి పనిచేసినవు?" అన్నాడు

శర్మ చేతులను ముఖానికి అడ్డుపెట్టుకొని రోదిస్తూ, "నా బుద్ధి భ్రష్టు పట్టింది,నా దరిద్రం నన్ను చేయగూడని పనిని చేయించింది" అన్నాడు.

"అది సరే సీనయ్య! పెద్దింటి వాళ్ళు కట్టుకునే చీరలు నీవు ఎత్తుకుపోతే, రేపు నీ భార్య అది కట్టుకొని ఊళ్ళో తిరిగితే ఇప్పుడు నీవు తప్పించుకున్నా ఎప్పటికైనా నీవే దొంగవని తెలిసేది కదా. ఇంత చిన్న ఆలోచన రాలేదేందయ్య" అన్నాడు జాలిగా. అతని ఒంటికి అంటుకున్న ముళ్లను తీస్తూ.

మళ్ళీ తానే " అయిందేదో అయింది.ఇక్కడి నుండి వెళ్ళిపో "అన్నాడు. శర్మ తన చేతిలో ఉన్న వెలిసిపోయిన పాత చీరలను పారేసి ఆక్కడి నుండి దుఃఖభారంతో పరుగుతీసాడు.

వీరన్న చీరలను పట్టుకొని ఇంటిలోకి వచ్చాడు.

"ఎవడో చిల్లర దొంగ అమ్మా ! నన్ను చూడగానే చీరలు విడిచి పెట్టి పారిపోయాడు"అంటూ పద్మమ్మకు చెప్పి, చీరలను అక్కడ పెట్టి,నులక మంచం వైపు వెళ్ళాడు.

"నీ దొరకు ఎన్ని సార్లు చెప్పిన. గీ గోడ ఎత్తు పెంచమని. వింటెనా. ఈ సారి వచ్చినప్పుడు నీవన్న కొంచెం గట్టిగ చెప్పు.కొంచెం మెల్కగనే ఉండు" అంటూ వచ్చిన దొంగను నోటికివచ్చిన బూతులు తిడుతూ లైట్ బంద్ జేసి తలుపులు మూసుకొని లోపలివెళ్లింది పద్మమ్మ.

దూరంగా వెలిసిపోయిన పాత చీరలు కనిపిస్తున్నాయి. వాటిని చూస్తే శర్మ లాంటి వాళ్ల జీవితాలు కూడా అలాంటివే కదా అనిపించింది అతనికి.

వీరన్నకు నిదుర పట్టడం లేదు. తన మిత్రునికి తాను యేసాయం చేయకపోగా, కనీసం వెలిసిపోయిన పాత చీరలు పట్టుకుపోతున్నప్పుడు తీసుకు పొమ్మన్నా బాగుండేదేమో అనుకున్నాడు. "రేపు వెళ్ళి యేదైనా కనీస సాయం చెయ్యాలి" అనుకున్నాడు.

సీనయ్య దుర్గతికి మనసులో చాలా సేపు దుఃఖపడ్డాడు. "దుర్గమ్మ తల్లి నీవే సీనయ్య కష్టాలు తీర్చు" అని మనసులో మొక్కుకున్నాడు

తెల్లవారుతూనే వీరన్న లేచాడు తన గుడిసెలోకి వెళ్ళాడు. తన భార్య కున్న చీరలలో మంచివి రెండు చేతిలోకి తీసుకున్నాడు.

సీనయ్య ఇంటికి వెళ్ళాడు ఇంటి తలుపులు దగ్గరికి వేసి ఉన్నాయి. "సీనయ్యా!" అంటూ తలుపులను తోసాడు. లోపలి దృష్యం చూడగానే వీరన్నకు ఒక్క సారిగా తన కింద ఉన్న నేల కదిలినట్లు అనిపించింది.సీనయ్య దంపతులు తమ వంటి పైన అంత దాకా ఉన్న ఆ చివరి వస్త్రాలతోనే ఉరి వేసుకున్నట్లున్నారు. దూలానికి నగ్నంగా వేలాడుతూ కనిపించారు. తన దగ్గర ఉన్న రెండు చీరలను వారికి చుట్టి,

"ఘోరం జరిగిపోయింది" అంటూ గుండెలను కొట్టుకుంటూ ఊళ్ళో వాళ్ళకు ఆ విషయాన్ని తెలపడానికి అక్కడి నుండి పరుగెత్తాడు. ★★★

# తెలుగు పొడుగు

## ప్రభాకర మూర్తి

పది కోట్లయ్యేరు ఒకటి రెండయ్యేరు
తెలుగు దేశ ప్రజలు . ఆరంభ శూరులు
బండి 'ర' ల, అర్ధ సున్నల గ్రాంథిక భాష పోయె సరే
తేట తెలుగు మాట మణులు మాండలీకాలు
మట్టి కరచు నేమో నక్కటా !
ఉభయ రాష్ట్రాల వ్యావహారికాంగ్లాన తెలుగు బడుగు
అమెరికా దేశానా ఆంధ్ర ఛందానికో పొడుగుమడుగు?
ఏది తెరగు మరి యెక్కడ నవ యువతకు భాష తొడుగు?
పిడుగు గిడుగు నడుగు! యేడ తెలుగు పొడుగు?

అ ఆ ఇ ఈ ల తెలుగు అక్షరాలు
దీర్ఘాలు, వత్తులూ , వట్రసుడుల గుణింతాలు
అమ్మ ఆవుల తెలుగు వాచకాలు
కోతీ బావల చిట్టి మిరియలూ గుమ్మాడులు గుడుగుడుగుంచాలు
సంధులూ ఛందాలు పద్య ప్రహసనాలు
నేర్పే సాధనాలేవీ? పలికేందుకు చిన్నారులకి ప్రోత్సాహాలేవీ ?
లేని తెలుగు మాధ్యమాల తెలుగు బడుగు
పిడుగు గిడుగు నడుగు! యేడ తెలుగు పొడుగు?

పుట్టింట రాజ మన్నన పట్టని మేటి బాస
కొత్త కూనలెరుగని కూసు బాస
ఖండాంతరాల ఖ్యాతి , గాలి లేని జ్యోతి
గళహీన గానమది, గంగోత్రి ఇగిరిన గంగ
శుకాల పికాల కోలాహల కటాకువుల క్యూర చతుష్పాదాల
పచ్చటి చెట్ల నీడ లేని చదలయడవి
జలదరార్భటుల జడిగాలి వానలో
ఆచ్ఛాదన లేని కర్ర గొడుగు
ఏది తెరగు మరి యెక్కడ నవ యువతకు భాష తొడుగు?
పిడుగు గిడుగు నడుగు! యేడ తెలుగు పొడుగు?

తెనుగు బాస పేస కోటి తారాజ్వలిత సిరీ శ్రీముఖ హారం
కవిత్రయ, కొప్పరపు, తిరుపతి వేంకటాది కవుల
సహస్రావధాన మేధో జనిత బాసర శారదా మధు శ్వాస
శ్రీనాధ కవనాన పలనాటి శృంగార శయ్యాదిక
పోతన కవితానుప్రాసల సుధాసార రజతాచల కుసుమవాటిక
శ్రీశ్రీ ప్రస్థానాల ఆరుద్ర కూనపదాల
ఆత్రేయ మనసు పిపాసల విశాఖ సాగర కవితాంతరంగ హోరు
గురజాడ గిడుగుల ఉత్తరాంధ్ర వంశధార
దాశరథీ సినారెల తెలంగాణ వీణా సమ్మేళనం
కోటి భాషల పెట్టు అచ్చ తెనుగు నుడికట్టు
ముందుచూపేలేని పాలకుల పాడిగట్టు
దేశదేశాల భాషాభిమాన ఔపోసనోదకం
ఆంధ్రదేశాన వెల్లువై చిమ్మనగ్రోవియై తేట బాసను చిమ్ము
తెలుగు యెన్నడు పొడుగు, కలత వలదు గిడుగు
ప్రపంచ భాష తెలుగు .. సొబగు

## వైద్యుని తపన

**డా. రమ్యశ్రీ:**

పాతికేళ్ళపచ్చికాయపగులగా చేతకాక ఏమిచేయలేక చిన్న
కన్నీటిబిందువొకటి రాల్చినది నేనా ?

నిండైనపండుజీవితం పరమపదమందగా జీవనాడిలేదని
సూటిగచెప్పనేర్చిన ఘనత నాదా ?

ఆబ్రహ్మకీటజననీ !

నీ సూక్ష్మసుత నీ మానవసుతులను ఆహుతి చేయ చూడతగునా ?

పండుజీవితాలు నిండుగా నీ ఒడికి చేర్చక

పసిడి కాయలనేల నేలరాల్చుట ?

ఏ తల్లి ఓర్చునే ఈ కఠినత ?

జీవకోటినందున్న మాతృరూపిణి !

శరీరశాస్త్రముల విద్యనొసగిన వాణీ !

ఈనాడింత అచేతనత్వమలమనేల ?

వాడిపోతున్న వేడి తనువుల సేదతీర్చనీయవేల ?

ప్రాణవాయువైన నీ

చైతన్యశక్తి పట్టు విడెచెనే !

జఠరాగ్నివైన నీ పోషక శక్తి సన్నగిల్లెనే !

ఇహపరములనొసిగే తల్లీ, ఇహములేకనే పరమందువా ?

ఈ బీభత్స రసప్రవాహానికి భాషయే భారమాయె !

ప్రాణమొదులు నాడు ప్రాణికి తనవారి పలుకు కరువుగనాయెనే !

రుద్రభూమిచేరిననాడు వదలవలసిన బాంధవ్యాలు వ్యాధితీరుటకై
వచ్చిననాడె వదవలసివచ్చెనె !

కాలుని భటులా? ఈ వింత తొడుగులలోన వైద్యులా ?

ముక్కుల కట్టిన బంధాలతో ఊపిరి ఆడక

మరో ఊపిరి ఆడని ప్రాణికి గాలిగొట్టాలు

పెట్టాలన్న ఈ తపన ఆగదే !

గాలియంత్రాల ఊపిరులు ప్రాణవాయువులు కాలేకున్నాయే !

ఆబ్రహ్మకీటజననీ ! అంతమేది ?

## కరోనాకి వైద్యం

**డా. రమ్యశ్రీ:**

వేదసారమే ఔషధ రసాయనమే !

ఉసిరికాయ సర్వవ్యాధి నివారణమే !

వేడి అన్నాన ఘృతధార  తోడుగా ఆరగించి ఆస్వాదించి

రసనాడి రసాస్వాదనకుపక్రమించగా

రక్తకోశం క్రిమినిరోధక శక్తిని పుంజుకొనగా

ఖాళీ కంచం మళ్ళీ ఏదని మారడిగింది

ఈ మారు రసభరితంగా కొత్త నిమ్మ నాట్యం చేస్తూ

నోట్లోకి వస్తానంటోంది

నాసాటి లేదంటూ నాలికపై నృత్యం

నిమ్మలోని పులుపుకారాలు నవరసాలూ

మా వారసులేనంటూ ప్రదర్శిస్తున్నాయి

పరమార్థం అర్థం కావలంటే అల్లమే ఆస్వాదించాలంటూ

అరుదెంచింది అల్లంపచ్చడి !

రసాస్వాదనకు పైమెట్టు, నిర్వాణానికి

అసలు మెట్టు అని ఆవేశపడుతూ !

అసలు ధర్మంగా అర్ధకామాలు తీర్చేదీ

తీర్చి పరమపదానికి సోపానం వేసేదీ

అల్లమేనని అన్నంతో అంటూ

కారణజన్మురాలినని కలిసిపోతోంది.

ఇంతింతై మరింతై రోగక్రిములపాలిట

ఉప్పెనంతై కరోనాలను సైతం కడతేర్చేంతై

త్రిశక్తి స్వరూపాలై కాపాడాయి కడకు వైద్యనారాయణిడినే!


Visit Our website www.tfasnj.org
తెలుగు కళా సమితి
Telugu Fine Arts Society
A 501 (c) Non Profit Org. Tax ID : 22-2534166,www.tfasnj.org
New Jersey
తెలుగు కళా సమితి దీపావళి ధమాకా
VIRTUAL LIVE EVENT ON
DECEMBER 5TH SATURDAY 1:00 PM EST
మస్త్ పాటల మజాకా
PRATAP RYTHMS
SURESH GUITARIST
TEJ BHUPALLY KEYS
SHYAM VIALINIST
SRUTHI RANJAN PLAYBACK SINGER
SHREEDEEP PLAYBACK SINGER
జబర్దస్త్ కామెడీ తడాఖా
DEEVENA
YODHA
NIHANTH
ROCKING RAKESH
SPECIAL APPEARANCE SESHU KUMARI SINGER
INDHU ANCHOR
జానపద గానా భజానా
చతురులు & మిమిక్రీ
THE GREAT TELUGU LAUGHTER CHALLANGE ( STAR MAA )WINNERS
BANDAM RAJU
LAVANYA
స్థానిక కళాకారుల హంగామా
MOGILI GUNAKAR
MIMICRY KISHOR
ఇంకా కథల, కవితల,వంటల పోటీల విజేతల వివరములతో వచ్చేస్తుంది వేదికగా
For additional information
Sreedevi Jagarlamudi 732-470-7055
Jyothi Gandi 732-208-9599
Srinivas Cheruvu 732-447-6686
Bindu Yalamanchili 908-240-3167
Anuradha Para 201-312-5335
Yasoda Dasika 908-304-3710
Usha Darisipudi 732-718-4184
Anuradha Dasari 908-907-1502
Ravi Annadanam 917-355-5503
SPONSORS
COLDWELL BANKER
BINDU YALAMANCHILI ABR, SRES
CELL : (908) 240-3167
BinduNJhomes@gmail.com
www.binduNJhomes.com
NEW YORK LIFE
Thevan Theivakumar,
Execution Partner, CLFO
Phone : (732)744-3763, Cell : (732)319-8758
NEW YORK LIFE INSURANCE COMPANY
379 Thornall St , 8th floor, Edison, NJ 08837
Balaji Flowers Usa
GENOMIC DIAGNOSTICS NA
(973) 801-5800 www.GenomicsNA.com
AITA
AITA CONSULTING SERVICES INC.
AI/ML/RPA || ANALYTICS || IOT || CLOUD || INTEGRATION
NORTH BRUNSWICK NJ, WWW.AITACS.COM
732-658-5164 X400,HR@AITACS.COM
SIDDHENDRA KUCHIPUDI ART ACADEMY
FOUNDER AND ARTISTIC DIRECTOR: SWATHI ATLURI-GUNDAPUNEEDI
PHONE: 732-429-2948
EMAIL: SIDDHENDRAKUCHIPUDI@GMAIL.COM
WWW.SIDDHENDRAKUCHIPUDIARTACADEMY.COM
HTTPS://WWW.FACEBOOK.COM/SIDDHENDRAKUCHIPUDI
This Event Organised by ABR PRODUCTIONS
Watch Live On
YouTube /abr tv
facebook /abr tv
mana tv
TV5 NEWS
THE ONLY LOCAL CHANNEL AVAILABLE ON WORLD'S LARGEST DIGITAL PLATFORM
YUPPTV dish sling

# ముసురు

## దేవులపల్లి దుర్గా ప్రసాద్

"ఏటీ గాలీ వానా, ఇంకా తగ్గకుంటన్నాయి?" స్వగతాన్ని బయటకే అంటూ చిరాకు పడుతోంది గోవిందమ్మ. విశాఖపట్నం బీచ్ రోడ్డులో సముద్రంవైపు ఉన్న ప్రహారీ గోడమీద తాటాకు గొడుగు సర్దుకుంటూ గొంతికిలా కూర్చుని తనముందున్న కుంపటిలో మొక్కజొన్న పొత్తులు కాలుస్తూ అప్పటికి రెండురోజుల బట్టీ తగ్గని గాలీ వానా మీదా విసుక్కుంటోంది.

పక్కనే పిడతకింద పప్పు బండి నడుపుతున్న పాపారావుకి పాతికేళ్ళ వయసులో ఉండీ, వడ్డాది పాపయ్య బొమ్మలా ఉండే గోవిందమ్మ అంటే ఎంతో మోజు. తనెప్పుడు "ఊ" అంటుందా అని చూస్తుంటాడు. కానీ గోవిందమ్మ మాత్రం పాపారావుని దగ్గరికి రానివ్వదు.

"రంగస్థలంలో రంగమ్మత్తలాగ ఎంత సొంపుగున్నావే గోవిందమ్మా!" అన్నాడు పాపారావు గట్టిగా తన బండి దగ్గరనుండి. విననట్టే ఊరుకుంది గోవిందమ్మ.

గాలి లేక పోయినా వాన జల్లు మాత్రం ఆగలేదు. "ఇయ్యాలైనా బేరాలొస్తే బాగున్ను. మావకి డాట్రు కాడికి తీసుకెల్లాల. ఏటో ఒల్లు కాలిపోతున్నోడిని ఇంటి కాడ ఒంటిగా ఒగ్గీసొచ్చీసేను. తిండి గింజన్నేవు. సేతిలో డబ్బులాడట్లేదు. ఈ పాడు జబ్బు కరోనా కాదు గాని, అది వచ్చినోల్లు, రానోల్లు అందరూ సస్తన్నారు. ఈ పాపారావు గాడు గోతికాడ నక్క నాగ సొల్లు కారుత్తాడు నన్ను సూసి. మావ బాగుపడి నేస్తే ఈడి సంగతి సూసుకుంటాడు. అందాకా ఈడితో జాగత్తగుండాల. ఈ టయాములో డబ్బులేటైనా ఔసరమైతే ఈడే సద్దగల్డు." అనుకుంటూ గోవిందమ్మ కుంపటి ముందు విసనకర్రతో విసురుతూ, మీదున్న జొన్నపొత్తులని అటూ ఇటూ తిప్పుతోంది.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

రవి తన రూంలో కిటికీ దగ్గర నిలబడి పడుతున్న వానని చూస్తూ సిగరెట్టు కాలుస్తున్నాడు. కిటికీలోనుండీ కింగ్ జార్జ్ హాస్పిటల్ కనబడుతోంది. తన మనసులాగే బయట వాతావరణం కూడా మబ్బు పట్టి, డల్ గా ఉంది.

రవి ఒక మెడికో. ప్రస్తుతం హౌస్ సర్జన్ చేస్తున్నాడు. తన క్లాస్ మేట్ రమణిని ఎంతో గాఢంగా ప్రేమించాడు. మొదట్లో రమణి కూడా రవితో ప్రేమలో ఉండేది. కానీ ఈమధ్యనే రమణి రవిని దూరం పెట్టడం, తమ క్లాస్ లోనే వేరే అబ్బాయితో చనువుగా తిరగడం చూసి తట్టుకోలేక పోతున్నాడు రవి.

ఒకసారి రమణిని మొహమ్మీదే అడిగేసాడు. దానికి ఏదో డొంక తిరుగుడు సమాధానం చెప్పిందే తప్ప సూటిగా చెప్పలేదు. దాంతో ఇంకా మానసిక అశాంతితో రగిలిపోతున్నాడు రవి.

తనకి, రమణితో ప్రస్తుతం తిరుగుతున్న వ్యక్తికి పోలికలు చూసుకుంటున్నాడు. అలా చూస్తే ఆ కొత్త వ్యక్తి రవి కన్నా ఆర్థికంగా బాగా ఉన్నతుడే. హౌస్ సర్జన్ అయినవెంటనే మల్టి స్పెషాలిటీ హాస్పిటల్ పెట్టగలిగేవాడే. తనైతే అలాంటి హాస్పిటళ్ళలో ఉద్యోగం వెతుక్కోవడమే తప్ప, సందులో చిన్న క్లినిక్ అయినా పెట్టగలిగే ఆర్థిక పరిస్థితి ఉన్నవాడు కాదు. రమణికి ఆడంబర జీవితమంటే చాలామోజు. అలాంటి జీవితం అనుభవించడానికి తగిన ఆర్థిక స్తోమతకు చేరుకోవడానికి, తాము కొన్ని ఏళ్ళు కలిసి కష్ట పడదామనుకున్నారు కూడా.

కానీ ఇంకా సులువుగా అలాంటి జీవితం ముందుకొచ్చి వాలుతుంటే ఎవరు వదులుకుంటారు? "ఛీట్! డబ్బుకు మనసమ్ముకునే వెలయాలు" అని కసిదీరా తిట్టుకున్నాడు రవి తన చేతిలో ఉన్న సిగరెట్టు ఆఖరి దమ్ము గట్టిగా పీల్చి వదిలి ఆ సిగరెట్టు పీకను నేలకేసి కొట్టి కాలితో నలిపేస్తూ.

అంతవరకూ కాలేజీలో పేరున్న ప్రేమజంటల్లో రవీరమణులది ఒకటి. కాని ఇపుడు "పాపం రవి!" అనుకుంటున్నారు అంతా. రమణి తన మనసుకు చేసిన గాయం బాధతో పాటూ, నలుగురిలో తనకు కలిగిన అవమానంతో కృంగిపోతున్నాడు రవి.

దాంతో ఒక నాలుగు రోజులు హాస్పిటల్ డ్యూటీలకి కూడా వెళ్ళలేదు. కానీ ముందు రోజే డీన్ పిలిచి, "ఈ కరోనా టైంలో నువ్విలాచేస్తే ఉన్న ఉద్యోగం ఆసరా కూడా పోతుంది, చదువు మధ్యలో ఆగిపోతుంది" అని చీవాట్లు వేయడంతో ముందు రోజు రాత్రి నైట్ డ్యూటీకి వెళ్ళాడు. ఈ రోజూ మరలా నైట్ డ్యూటీకి వెళ్ళాలి. రాత్రి నిద్రలేకపోవడానికి తోడూ, ఈ మానసిక సంఘర్షణ మనసుని, మనిషిని నలిపేయడంతో ఇంట్లో ఉండలేక ఆ చిరుజల్లులోనే తన బైక్ మీద బీచ్ ఒడ్డుకి బయల్దేరాడు.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

సాయంత్రం నాలుగుగంటలు అయింది. గోవిందమ్మ తమపక్కనే ఆగిన బైకును చూసి కొద్దిగా ఆశగా తలపైకెత్తి చూసింది. బైకు దిగిన రవి బీచ్ వైపు చూసుకుంటూ వెళ్ళి అక్కడున్న పిట్టగోడమీద, సముద్రం వైపు ముఖం పెట్టి కూర్చున్నాడు.

అరగంటసేపైనా, చినుకులు పడుతున్నా, తడిసిపోతున్నా మనిషి కదలట్లేదు, చూపు మరల్చట్లేదు. అక్కడే ఉన్న పాపారావు కూడా రవిని గమనిస్తున్నాడు. గోవిందమ్మ పాపారావుకి సైగ చేసింది రవి వైపు చూపించి.

వెంటనే పాపారావు ఒక పది రూపాయల పిడతకింద పప్పు పొట్లాం పట్టుకెళ్ళి, రవిని సమీపించాడు. "బాబూ, ఇట్టాంటేల ఈ పి.కె.పి. తినండి బాబూ! మంచి మజా గుంటది." అని పొట్లాం రవికి ఇచ్చాడు.

అటుతిరిగే పొట్లాం అందుకున్నాడు. జేబులోంచి డబ్బులు తీసి ఇవ్వబోయి ఆగి "ఇగో, రెండు బీర్లు పట్టుకొస్తావా? తెచ్చినందుకు నువ్వేదైనా తీసుకో." అని ఐదు వందల రూపాయల నోటు పాపారావుకి ఇచ్చాడు.

"ఇది మంచి బేరాలటైం బాబూ! ఐనా వానోటి పడతాంది గదా!" అన్నాడు నసుగుతూ పాపారావు.

"నా బండి తీసుకెళ్ళు. నీకూ ఒక బీరు తెచ్చుకో!" అని రవి అనడంతో ఉషారొచ్చింది పాపారావుకి. "అలాగే బాబూ తెస్తాను

ఇయ్యండి" అని డబ్బులూ,బండి తాళాలూ తీసుకుని, "ఇగో, గోవిందమ్మా! "అని కేకేసాడు.

గోవిందమ్మ వచ్చింది. "నీగొడుగూ కుంపటి ఈ బాబు కాడ పెట్టి ఇలా కూకో. అతగాడు తడిసిపోతన్నాడు కదా. నువ్వెదురుగుంటే ఎచ్చగుంటాది. నా బండి కూడా సూస్తుండు. నేనిప్పుడే సిటంలో వచ్చేత్తాను" అని కన్ను గీటాడు రవిని చూపించి.

పాపారావు వెళ్ళి పది నిమిషాలు గడిచింది. రవి ఏమీ మాట్లాడలేదు. కానీ గోవిందమ్మని పరిశీలిస్తున్నాడు. ఆతాటాకు గొడుగు కింద తామిద్దరూ, కుంపటీ తడవకుండా ఉండడానికి గోవిందమ్మ తంటాలు పడుటోంది. తను ఒద్దికగా మోకాళ్ళ మీద కూర్చోవడంలో తన శరీరపు వంపులు, ఆ బింకమూ చూసి కాస్సేపు విచలితుడయ్యాడు రవి.

రవి పరిస్థితి గమనించింది గోవిందమ్మ. తన భర్తని బాగుచేసుకునే అవకాశాలకి తలుపులు తీసినట్లయాయి ఆటైంలో రవి చూపులు.

ఇంతలో తేరుకున్న రవి, తాను లేచి వెళ్ళి పాపారావు బండి దగ్గర రేకు కింద స్టూలు మీద కూర్చున్నాడు, వానకి తడవకుండా.

పాపారావు వచ్చాడు బీరు సీసాలతో. పాపారావుని కూడా తనతో పాటూ తీసుకోమన్నాడు. వ్యాపారం టైమని, తాను ఇంటికెళ్లి తాగుతానని చెప్పాడు పాపారావు. గోవిందమ్మ కారం రాసిన జొన్నపొత్తు ఒకటి కాల్చి ఇచ్చింది. మధ్య, మధ్యలో అది తింటూ బీర్ సీసాలు ఖాళీ చేసేసాడు రవి.

అప్పటికి ఏడు గంటలయింది. వాన ఇంకా తగ్గలేదు. రవి బైకు మీద కూర్చుని బయల్దేర బోతున్నాడు. "బాబూ! ఒక్క నిమిసం" అంటూ గోవిందమ్మ దగ్గరగా వచ్చింది.

"ఈవానలో ఏటి బేరాల్లేవు. నాను కూడా ఎలిపోతాను. మాఇల్లు అప్పూఘర్ ఎల్లే తోవలోనే. నన్నక్కడ దింపీగలరా? ఆటోలు కూడా ఏటి రావు ఈయేల." అని చిరునవ్వుతో అడిగింది.

"నారూటు అటుకాదే" అందామనుకున్నా, ఎందుకో అనలేకపోయాడు "సరే వచ్చెయ్. దింపేస్తాను" అన్నాడు.

కుంపటి, తాటాకు గొడుగు పాపారావు బండికింద సర్దేసింది. తన సంచీ తీసుకుని రవితో హడావుడిగా వెళిపోతున్న గోవిందమ్మని చూసి అనుమానపడ్డాడు పాపారావు. అదే నిజమైతే ఇన్నాళ్ళూ నిప్పులా ఉన్న గోవిందమ్మ ఇక మన దారిలో పడ్డట్లే అనుకుని సంబర పడ్డాడు పాపారావు.

వానలో బైకు జోరుగా సాగిపోతోంది. తాగిన బీరుమత్తో, దరినున్న స్త్రీ సాహచర్యపు మత్తో, తనని మోసం చేసిన ప్రియురాలి మీద కోపమో ఏమో తెలియదు కాని రవి మాత్రం ఆ క్షణాలను బాగా ఎంజోయ్ చేస్తున్నాడు. ఇంతలో బీచ్ రోడ్డులో చీకటిగా ఉన్నచోట బండాపమంది గోవిందమ్మ.

తను దిగింది. రవికి ఎదురుగా వచ్చింది. "బాబూ! నానొక్క ఇసయం అడుగుతాను మరోలా అనుకోకండి. నాను మీకు నచ్చానా?"

"ఆ." అన్నాడు రవి అందులో అనుమానమేముంది అన్నట్టుగా.

"నాతో ఉంటారా?" ఈ ప్రశ్నకి గతుక్కుమన్నాడు రవి.

"మరోలా అనుకోమాకండి. నేనలాటిదాన్ని కాను. ఇంతవరకూ నామావ తప్ప ఎవరూ నా మీద సెయ్యెయ్యలేదు. కాని ఈ కరోనా కరువు కాలానా నాకు బతుకు గడవడం సానా కట్టమైపోతున్నాది. ఉత్తినే ఇమ్మంటే ఎవలిస్తారు డబ్బులు? అయినా నాక్కూడా అలా ముస్టి తీసుకోబుద్ది కాదు. అందుకే అడిగినా. ఎయ్యో, రెండేలో పనయిన తర్వాత మీ సంతోసం కొద్దీ నా సేతిలో యెట్టండి. తవరికి ఇస్టమైతే నన్ను మా ఇంటికాడకి తీసుకెల్లండి. లేదా ఆ జంక్సన్ లో దింపేసి మీరెలిపోండి" అని సూటిగా చెప్పింది గోవిందమ్మ.

ఒక్క క్షణం ఆలోచించిన రవి, "మీ ఇంటికే వెళ్దాం పద."అన్నాడు. ఆమాటతో గోవిందమ్మ మొఖం వెలిగి పోయింది.

అది వీధి చివరన విసిరేసినట్లున్న రెండు వాటాల చిన్న స్లాబిల్లు. కిందొక వాటా. పైనొక వాటా. పైనున్న వాటా వైపు మెట్లెక్కి వెళ్ళారు ఇద్దరూ. వాన, చీకటిగా ఉండడంతో బయట ఎవరి అలికిడీ లేదు. తలుపులు తాళం తీసింది.

ముందు వరండా చాలా ఇరుకుగా ఉంది. లోపలికి వెళ్ళి చూసి ఆశ్చర్య పోయాడు రవి. కేవలం రెండు గదులు. రెండు గదుల్లోనీ లైట్లు వేసింది. వెనక బాల్కనీలాంటి జాగాలో బాత్రూం, లేవెట్రీ. మరి కొంత ఖాళీ స్థలం. తాము చిన్నప్పుడు ఉండే ఇల్లు గుర్తుకొచ్చింది రవికి.

ముందు గదిలో మంచం మీద గోవిందమ్మ మొగుడు, చిన్నగా మూలుగుతూ ఒంటిమీద తెలివిలేనట్లుగా పడుకుని ఉన్నాడు. రవిని లోపలి గదిలో చిన్న స్టూలు మీద కూర్చోబెట్టింది.

ఆ లోపలి గదిలో, ఒకమూలగా వంటింటి ఏర్పాటు, మరొక పక్క స్టోర్ రూం సెటప్పు, ఇంకొంత మెసలడానికి జాగా ఉన్నాయి. గోడకి తగిలించిన ఒక దేవుడి పెట్టి కూడా ఉంది. అందులో జీరో వాట్ బల్బు కాంతిలో, వెంకటేశ్వరస్వామి ఫోటో కనబడుతోంది.

"అచ్చం మాచిన్నప్పుడు ఇల్లులానే ఉంది. అమ్మకి వెంకటేశ్వరస్వామి అంటే ఎంత భక్తో!" అని తన పాత జ్ఞాపకాలలోకి వెళిపోతున్నాడు రవి.

అతను అలా దేవుడి పెట్టె వైపే చూస్తుండడం గమనించిన గోవిందమ్మ, ఆపెట్టె పైనున్న తెర లాంటి తెల్లటి తువ్వాలుని కిందకు లాగేసి దేవుడి పెట్టె కప్పేసింది.

ఆ లోపలి గదిలోనే కొన్ని సామాన్లు సర్ది, కొన్ని ముందు గదిలోకి, కొన్ని బయట బాల్కనీ లోకి మార్చి ఖాళీ చేసింది. ముందు గదిలోంచి చాప, పరుపు, దుప్పటి రెండు తలగడలు తీసుకొచ్చి వేసింది. అంతవరకూ అసలు జాగా లేదనుకున్న స్థలంలో చక్కని పక్క ఏర్పాటు చేసేసింది. అదంతా చూస్తూ ఆశ్చర్య పోతున్నాడు రవి.

"అమ్మా! నేనెక్కడ పడుకోవాలే?" అని విసుగ్గా ప్రశ్నిచే తనను, "ఆగరా, నేసర్దుతాను కదా!" అని సముదాయించి ఇలాగే మంత్రం వేసినట్టు విశాలమైన పక్క ఏర్పాటు చేసే తన తల్లి గుర్తుకువచ్చింది రవికి.

"బాబూ, ఐదు నిమిసాలు. మా మావకి రెండు రోజుల బట్టి జొరం. పొద్దున కాడ్నించీ ఈడేటీ తాగనేదు. ఇంత గంజి ఆడికి తాపించేసి వచ్చేత్తాను." అని చెప్తూ ఆగదిలోనే ఒక మూల ఉన్న పొయ్యి వెలిగించి చక చకా తన పని చేస్తోంది మధ్య మధ్యలో సుధీర్

వైపు చూసి నవ్వుతూ, కబుర్లేవో చెప్తూ.

కానీ రవి మనసు అక్కడ లేదు. తన చిన్నపుడు తండ్రికి జ్వరం వచ్చినపుడు, తమతో కబుర్లు చెప్తూ తమ తండ్రికి శుశ్రూష చేసే తల్లే గుర్తుకు వచ్చింది.

"మా రవి పెద్దవాడయి డాక్టరైతే వాళ్ళ నాన్నగారికి వచ్చే ఇలాటి జ్వరాల్ని ఇట్టే తగ్గించేస్తాడు. ఏరా కన్నా?" అనే తల్లి మాటలు గింగిరాలు తిరుగుతున్నాయి బుర్రలో.

తన తండ్రి జబ్బుతో మంచాన పడి చనిపోయాడు. తండ్రిని బ్రతికించుకోవడానికి తమ తల్లి ఎన్ని బాధలు పడేదో తనకి గుర్తే. మావయ్య, తెలిసిన వారు చేసిన ఆర్థిక సాయం, తండ్రి కంపెనీ వాళ్ళు ఇచ్చిన డబ్బూ, తల్లి వంట పనులు చేస్తూ సంపాందించినదీ ఇలా అన్నీ కలుపుకుని గుట్టుగా సంసారాన్ని గడుపుకొచ్చింది తల్లి. అందుకుతగినట్టుగానే తనూ, చెల్లీ బాధ్యతెరిగి చదువుకునే వారు. చెల్లి కష్టపడి చదివి ఐ.ఐ.టిలో లో సీటు సంపాదించింది. తను ఈ డాక్టరీ పూర్తి చేసి, పల్లెలో ఉన్న తల్లిని దగ్గరకి తీసుకొచ్చి సుఖపెట్టాలి. చెల్లికి పెళ్ళి చెయ్యాలి. ఇకనైనా తమ బ్రతుకులు ఒక గాడిన పడాలి. ఆర్థిక కష్టాలు మనుషులని ఎంతకైనా దిగజారుస్తాయి. ఆ సమయంలో ఆదుకునే వారుంటే, ఆత్మస్థైర్యం తోడైతే గౌరవంగానే ఆ కష్టాలు దాటొచ్చు.

పక్క గదిలో గోవిందమ్మ భర్త గట్టిగా దగ్గాడు. ఒక్కసారిమత్తు వీడినట్లయింది రవికి. వెంటనే లేచి గోవిందమ్మ భర్త దగ్గరికి వెళ్ళాడు. చెయ్యి పట్టుకు చూసాడు. ఒళ్ళు కాలి పోతోంది. గబ గబా బయటకి వచ్చాడు. "బాబూ! ఒలిపోకండి. అది కరోనా జబ్బు కాదు." అని ఆత్రుతతో చెప్తున్న గోవిందమ్మని నీళ్ళు నిండిన కళ్ళతో చూసాడు.

"నేనొక డాక్టర్నమ్మా. భయపడకు. అది కరోనా అయినా సరే నేను తగ్గిస్తాను. మందులు తీసుకొచ్చి ఇస్తాను. ఇంజెక్షన్ చేస్తాను. అతను తాగడానికి వేడి నీళ్ళు పెట్టుంచు. నేనిపుడే మెడికల్ షాప్ కి వెళ్ళొస్తాను" అని అక్కడినుండి బయల్దేరాడు రవి

ఒక అరగంటలో మందుల బేగ్, బియ్యం బేగ్, బ్రెడ్లు, పాల పేకెట్లు, టీ పొడి, కూరగాయలతో వచ్చాడు. అతని చేతిలోని సామాన్లు అందుకుంది గోవిందమ్మ.

ఆమె భర్తకి ఇంజెక్షన్లు చేసాడు. ఇప్పటికి బ్రెడ్ ఇమ్మనీ, పొద్దున్నే ఏదైనా వండి తినడానికి ఇమ్మన్నాడు. రేపటి సాయంత్రానికి కూడా జ్వరం తగ్గకపోతే తనకి ఫోన్ చెయ్యమని తన నెంబర్ ఇచ్చాడు.

భర్తకి బ్రెడ్డూ, పాలూ ఇచ్చి, తనకీ, రవికి టీలు పట్టుకొచ్చింది గోవిందమ్మ. బయట వరండాలో నిలబడి టీలు తాగుతున్నారు ఇద్దరూ.

"బాబూ, మరి లోపలికి వెల్దామా?" అనడిగింది. అందులో కృతజ్ఞత, తను తీర్చుకోవాల్సిన ఋణ భారపు బాధ్యత కనిపించాయి రవికి.

గోవిందమ్మ మాటకి విచలితుడయిపోయాడు రవి. ఆమె చేతులు పట్టుకుని కంటినుండి నీళ్ళు జల జల రాలుతుండగా గాద్గదిక స్వరంతో చెపుతున్నాడు, "నన్ను క్షమించమ్మా. అలాంటి తప్పుడు ఆలోచనతో నీ దగ్గిరకి వచ్చినందుకు." అని ఇంక మాట్లాడలేక కన్నీరు కారుస్తూ ఆగిపోయిన రవి చెయ్యి మీద తన చెయ్యి వేసింది. ఇద్దరూ మౌనంగా ఉన్నారు. కాస్సేపటికి తేరుకుని "ఈ సాయం నేన్నీకు ఊరికినే చెయ్యట్లేదు. అప్పుగానే అనుకో. మీ ఆయనకి బాగు పడిన తరువాత, మీరు మళ్ళా వ్యాపారాలు బాగా చేసుకుంటున్నపుడు మెల్లగా తీరుద్దుగాని" అన్నాడు ముష్టి తనకి తీసుకోవడం ఇష్టముండదని గోవిందమ్మ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చి.

అతని మాటలకి గోవిందమ్మకి కన్నీటి ప్రవాహం ఆగలేదు. నిశ్శబ్దంగా రోదిస్తోంది. కాస్సేపు అలా ఏడ్వనిచ్చి ఆమె భుజం మీద అనునయంగా చెయ్యి వేసి ఓదార్చాడు రవి. భారంగా అడుగులు వేస్తూ మేడ మెట్లు దిగి బైకు మీద తన రూంకి బయల్దేరాడు.

మనసు నిండా ఎంతో సంతృప్తిగా ఉంది. తన మాజీ ప్రేయసి రమణిని, గోవిందమ్మతో పోల్చుకున్నాడు. గోవిందమ్మే గొప్పగా అనిపించింది. మైల పడని మనసు గోవిందమ్మది.

మర్నాటికి నగరంలో పట్టిన ముసురు తగ్గు ముఖం పట్టింది.

రవి మనసులో కూడా భగ్న ప్రేమ కలిగించిన ముసురు తగ్గి సేవా భావం, కర్తవ్య దీక్షల వెలుగు కిరణాలు వెల్లి విరిసాయి. సుధీర్, అతని స్నేహితులు చేసిన ఆర్థిక సాయంతో, గోవిందమ్మ, భర్తా బీచ్ రోడ్డులో, మొక్కజొన్నపొత్తులతో పాటూ, పిడత కింద పప్పు బండీ పెట్టి, వాటితోపాటు టీ కూడా అమ్మడం మొదలెట్టారు. పాపారావుకి మాత్రం గోవిందమ్మ మీద అనుమానమూ తీర లేదు, తన దురాశా తీర లేదు.

Balaji
Flowers Usa

# మిర్చీ బజ్జీ

## బోగా మనోహర

('అప్రాచ్య పరికరాలతో' చేసిన వంటకాల పోటీ లో బహుమతి గ్రహీత)

### కావలసిన పదార్థాలు

| | | | |
|---|---|---|---|
| శనగపప్పు | 1/4 కప్పు | పచ్చి మిరప కాయలు | 4-5 |
| ఇంగువ | చిటికెడు | శనగపిండి | 1/2 కప్పు |
| పచ్చి మామిడికాయ పొడి | 1/2 tsp | బియ్యప్పిండి/ వరి పిండి | 1/2 కప్పు |
| వాము | 1 tsp | పసుపు | 1 tsp |
| ఉప్పు | రుచికి తగినంత | గరం మసాలా పొడర్ | 1 tsp |
| చింతపండు గుజ్జు | 2 tsp | నీళ్ళు | సరిపడా |
| కారం | 2 tsp | | |

### Stuffing చేసుకునే విధానం

ఒక బౌల్/ బేసిన్ లో శనగపప్పు, కారం, ఇంగువా, కొంచెం మామిడి కాయ పొడి, కొంచెం వాము, ఉప్పు, కొంచెం చింతపండు గుజ్జ వేసి కలుపుకుని ఆ ముద్దని మిక్సీ లో వేసి paste లాగా చేసుకోవాలి. ఇప్పుడు పచ్చిమిరపకాయలు చీల్చి విత్తానాలు తీసేసి stuffing లో ఇంకొచెం చింతపండు గుజ్జ కలుపుకొని మిరప కాయల మధ్యలో కూర్చుకోవాలి.

### పై పిండి batter చేసుకునే విధానం

ఇంకొక బౌల్/ బేసిన్ లో శనగపిండి, వరిపిండి, పసుపు, కారం, గరం మసాలా, ఉప్పు నీరూ పోసి thick batter చేసుకొని దానిని మిరపకాయలకి పట్టివ్వాలి. Air fryer ని 180C వద్ద preheat చేసుకొని అందులో batter పట్టించిన మిరపకాయలు ఉంచి 6, 7 నిముషాలు ఉడికించాలి. అంతే, ఎంతో రుచికరమైన నోరూరించే మిరపకాయ బజ్జీలు వేడి వేడిగా సిద్ధం.


GENOMIC DIAGNOSTICS NA

FDA EUA authorized COVID-19 Diagnostic Test Kits.

(973) 801-5800 www.GenomicsNA.com



తెలుగు కళా సమితి
Telugu Fine Arts Society
A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org
New Jersey
VIRTUAL
Summer Fun Event
ఎండాకాలంలో ఆహ్లాదపు చిరుజల్లు...
August 30th, Sunday 2:30 pm EST
Please join us for
Exciting fun activities, Quizzes, Games and many more...
Activities for Adults:
Activities for Kids/Youth:
MAA MAATA- MEE PAATA
మా మాట – మీ పాట
CINE VINODAM
సినీ వినోదం
LITERARY CONTEST
సాహితీ సంరంభం
FUN GAMES / Singing
ఆట – పాట
And many more.......
WIN PRIZES
పగలే వెన్నెలగా ఆడుకుందాం
జగమే ఊయలగా పాడుకుందాం
వేసవి వెన్నెలతో స్వాంతన పొందుదాం
Please register for the event at our website www.tfasnj.org
For additional information:
Sreedevi Jagarlamudi 732-470-7055
Jyothi Gandi 732-208-9599
Srinivas Cheruvu 732-447-6686
Bindu Yalamanchili 908-240-3167
Anuradha Para 201-312-5335
Yasoda Dasika 908-304-3710
Usha Darisipudi 732-718-4184
Anuradha Dasari 908-907-1502
Ravi Annadanam 917-355-5503
Sponsors
COLDWELL BANKER REALTY
Raymond E. Uman, Realtor
Cell: 201-921-4395, Office:908-658-9000
302 Route 202/206, Bedminster, NJ 07921
raymond.uman@cbmoves.com
NEW YORK LIFE
Thevan Theivakumar,
Execution Partner, CLFO
Phone : (732)744-3763, Cell : (732)319-8758
NEW YORK LIFE INSURANCE COMPANY
Media Support :
mana tv HD
TV5 NEWS
SUNRISE TV
GNN
GK TV

# మనీషి

గుండమరాజు శ్రీ శేష కల్యాణి

ఒక ప్రభుత్వ కార్యాలయంలో గుమాస్తాగా పని చేస్తున్న ముకుందరావు, ఒకరోజు పొద్దున్న తన ఇంట్లో ఉన్నట్టుండి కళ్ళు తిరిగి పడిపోయాడు! ఇంటికొచ్చి అతడిని పరీక్షించిన వైద్యుడు ముకుందరావుకు ఏవో మందులిచ్చి ఒక మూడు రోజులపాటూ ఎటూ కదలకుండా ఇంటిపట్టునే ఉంటూ విశ్రాంతి తీసుకోమని చెప్పి వెళ్ళిపోయాడు.

"ఆ వైద్యుడికేం? ఏమైనా చెప్తాడు! మీరు ఎటూ కదలకూడదంటే అదెలా కుదురుతుంది? మీకు పగలంతా మీ ఉద్యోగమే సరిపోతుంది! ఆ తర్వాత ఏదో ఒక పని పెట్టుకుని ఊరెంబడిపడి తిరుగుతూ ఉంటారు! అలా తిరిగీ తిరిగీ ఇదిగో...! ఇప్పుడిలా ఆరోగ్యం చెడగొట్టుకున్నారు!! మీరు ఇప్పుడు బజారుకెళ్లి కూరలు పట్టుకురాకపోతే నేను ఈ పూట వంటెలా చేసేదీ? ఇంట్లో ఒక్క కూర కూడా లేదు! ఆడదాన్ని నన్నెళ్ళమంటారా బజారుకీ?", అంటూ ఎప్పటిలాగే భర్త ముకుందరావుపై విరుచుకుపడింది మాణిక్యం.

"అదికాదు మాణిక్యం! వైద్యుడు చెప్పినట్టు చేస్తే త్వరగా కోలుకుంటా కదా!", మెల్లిగా అన్నాడు ముకుందరావు.

"అంతా నా ఖర్మ! వెళ్లి కూరలూ, సరుకులు తెచ్చుకోకపోతే నా కడుపేగా మాడేదీ! నాకు కనీసం ఒక్క పిల్లో, పిల్లాడో పుట్టి ఉంటే ఈపాటికి వాళ్ళు నాకు ఇలాంటి పనులకు చేతికందొచ్చి ఉండేవారు! అయినా నాకు 'అమ్మా' అని పిలిపించుకునే యోగం ఉండాలికదా!", అని విసుక్కుంటూ సంచీ తీసుకుని చెప్పులేసుకుని బజారుకు బయలుదేరింది మాణిక్యం. ఇంకా తను అంటున్న వాక్యం పూర్తికాకుండానే ఆ వీధిలో ఎవరో, "అమ్మా!", అని తనను పిలవడంతో ఉలిక్కిపడి ఎవరా అని ఆ పిలిచిన వారి వంక ఆశ్చర్యంగా చూసింది మాణిక్యం.

"బజారుకెడుతున్నారా అమ్మా? రిక్షా కావాలా?", అడిగాడు రిక్షాతో అక్కడే నిలబడి ఉన్న ముత్యాలు.

'నేను బజారుకెడుతున్నానని వీడికెలా తెలిసిందో!', అనుకుంటూ, "ఊఁ!", అని రిక్షా ఎక్కి కూర్చుంది మాణిక్యం. రిక్షా బయలుదేరింది.

"ఇదుగో బాబూ! నేను బజారుకెళ్లి దగ్గర దగ్గర రెండేళ్లయ్యింది! ఆ బీదలవాడ అంటే నాకు మహా చిరాకు! అక్కడ ఎటు చూసినా కంపు కొడుతూ చెత్తా... ఈగలు ముసిరే పందులూనూ.. ! వాటికి తోడు గుడ్డలు సరిగ్గా వేసుకోకుండా అక్కడ తిరిగే ముష్టివాళ్లనూ, అక్కడుండే పేదోళ్ల ఇరుకిరుకు ఇళ్లనూ, శుచి-శుభ్రతలకు విలువనివ్వనివాళ్ళనూ చూస్తూ ఉంటే నాకు ఒళ్ళంతా కంపరం పుడుతూ ఉంటుంది! అందమైన ఈ సీతారామనగరానికి ఒక దిష్టిచుక్కలాంటిదా ప్రాంతం! దురదృష్టమేమిటంటే మనం బజారుకెళ్లాలంటే ఆ బీదలవాడనుండీ పోవడమొక్కటే మనకున్న మార్గం! ఇన్నాళ్లూ అటు వెళ్లకుండా ఎలాగో తప్పించుకోగలిగాను. కానీ ఇవాళ తప్పట్లేదు! అక్కడినుంచీ వెళ్ళేటప్పుడు రిక్షాను కాస్త వేగంగా నడుపు బాబూ! నేను నా ముక్కు మూసుకుని ఎక్కువ సేపు ఉండలేను!" అంది మాణిక్యం.

ముత్యాలు ఏమీ మాట్లాడలేదు. బీదలవాడ రానేవచ్చింది. 'అబ్బ!మొదలైంది!', అని మొహం చిట్లించిన మాణిక్యం, రోడ్డు మీద అడుగు లోతు గోతులుంటాయని ఊహించి రిక్షాను గట్టిగా పట్టుకుని మరీ కూర్చుంది.

ఆశ్చర్యం! రోడ్డంతా చదునుగా, ఒక్క గుంట కూడా లేకుండా ఉంది! రిక్షా కుదుపులు లేకుండా వెడుతూ ఉండటంతో ఊపిరి పీల్చుకుంది మాణిక్యం. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పూలమొక్కలు మంచి పరిమళాలు వెదజల్లుతున్నాయి!

'మురికి కంపు అని భయపడ్డాను! పూలమొక్కలు బాగానే పెంచారే!', అని అనుకుంది మాణిక్యం.

బీదలవాడలో వచ్చిన మార్పును గమనిస్తున్న మాణిక్యం కొద్ది దూరం వెళ్ళగానే, 'ఈ ప్రాంతం చాలా మారింది! ఇప్పటిదాకా ఒక్క పంది కూడా కనపడలేదు! మునుపటిలా మురికి, చెత్తా లేవు! ఇళ్ళు మాత్రం ఇంకా ఇరుకుగానే ఉన్నాయి! ', అని అనుకుంది.

ముత్యాలు రిక్షాను నెమ్మదిగా తొక్కుతూ బజారు వైపు వెడుతున్నాడు. బీదలవాడలో మాణిక్యానికి కనిపించినవారంతా ఉన్నంతలో కాస్త మంచి దుస్తులు వేసుకుని ఉన్నారు. రిక్షాకి ఎదురొచ్చిన వారంతా "నమస్కారమమ్మా!", అని తలవంచి మరీ తనకు నమస్కరించడం మాణిక్యానికి ఆశ్చర్యం కలిగించింది.

'ఏమిటో వీరిలో ఇంత మార్పు!', అనుకుంటూ సరుకుల దుకాణం వద్ద సరుకులు తీసుకుంది మాణిక్యం. సరుకులవ్యాపారి మాణిక్యంతో ఎప్పటికన్నా కాస్త ఎక్కువ గౌరవమర్యాదలతో వ్యవహరించాడు. సరుకులన్నీ ముత్యాలు రిక్షాలో పెట్టి, "కూరలు తీసుకుంటారా అమ్మా?", అని మాణిక్యాన్ని అడిగాడు.

"అవును!", చెప్పింది మాణిక్యం.

ముత్యాలు మాణిక్యాన్ని కూరలబజారుకు తీసుకెళ్లాడు. అంత దూరంలో రిక్షాను చూస్తూనే కూరల బజారులో ఉన్న ముగ్గురు యువకులు, "అమ్మగారొచ్చారు! అమ్మగారొచ్చారు!", అని అరుస్తూ రిక్షా వద్దకు పరిగెత్తుకొచ్చారు. కూరల బజారంతా ఎవరో అమాత్యులవారు వచ్చినంత హడావిడి! మాణిక్యానికి ఏమీ అర్థం కాలేదు! అన్ని దుకాణాలవారూ తాము అమ్ముతున్న కూరలు కొద్దికొద్దిగా తీసి సంచుల్లో సర్ది యువకులకిస్తే వారు వాటిని రిక్షాలో పెడుతున్నారు. ఎవ్వరూ మాణిక్యాన్ని డబ్బులు అడగట్లేదు.

"ఏమిటిదంతా? నేనెవరనుకుంటున్నారూ?", అడిగింది మాణిక్యం ఒక యువకుడిని.

కూరల వ్యాపారులంతా మాణిక్యం రిక్షా చుట్టూ గుమిగూడారు. వారిలో నారాయణ అనే వ్యక్తి ముందుకొచ్చి , "అమ్మా! ముకుందరావుగారు మాకు తండ్రిలాంటివారమ్మా ! కాబట్టి మీరు మా అందరికీ అమ్మ! రాకరాక ఇక్కడకు వచ్చారు. మిమ్మల్ని మాకు తోచిన విధంగా సత్కరించుకుంటున్నామమ్మా!", అన్నాడు.

"ఇంతకీ మావారు మీకు చేసిన ఉపకారమేమిటో?!", అడిగింది మాణిక్యం.

"అయ్యగారు మాకు చేసిన మేలు ఒక్క మాటలో చెప్పలేమమ్మా. మేమంతా జీదలవాడ వాసులమమ్మా. తినడానికి తిండి లేక, వేసుకోవడానికి సరైన బట్టలు లేక, మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేక దుర్భరమైన జీవితం గడిపేవాళ్లమమ్మా! అయ్యగారు గత రెండేళ్లగా మాతోటే ఎక్కువసేపు ఉంటూ మాకెలా బతకాలో నేర్పించారమ్మా. మా వాడ ఏ అధికారులకిందికి వస్తుందో చూసి వారితో అయ్యగారు ఓపిగ్గా ఎన్నోసార్లు చర్చలు జరిపి మా వాడను బాగుచేశారమ్మా! ఆయన ఉత్సాహం చూసి మాకు చేతనైనట్టు మేమూ పనులు మొదలుపెడితే, అయ్యగారు మాకు రావలసిన భూముల వివరాలు తీసుకుని ఆయనే న్యాయవాదులను ఏర్పాటుచేసి ఎన్నో ఏళ్లుగా గొడవలలో ఉన్న మా భూములను తిరిగి మాకు దక్కేలా చేశారమ్మా! వాటిని మేము సాగు చేసుకుని కూరగాయలు పండించి ఇక్కడ దుకాణాలు పెట్టి అమ్ముకుంటున్నామమ్మా! అయ్యగారి సలహా మేరకు వరిధాన్యాలు కూడా పండించి ఆ వచ్చే డబ్బుతో మేమంతా ఇప్పుడు లోటు లేకుండా బతకగలుగుతున్నాం! నిస్వార్థంగా ఆయన మాకు చేసిన సహాయంవల్ల ఇవాళ ధైర్యంగా మా కాళ్లపై మేము నిలబడగలిగే స్థితిలో ఉన్నాం! అయ్యగారికి ఏమిచ్చినా మా ఋణం తీర్చుకోలేం!", అని చెమర్చిన తన కళ్ళను అద్దుకున్నాడు నారాయణ.

గత రెండేళ్లగా తన భర్త ఇంటిపట్టున ఉండట్లేదని నోటికొచ్చినట్లు తిట్టడం గుర్తుకొచ్చింది మాణిక్యానికి. ఒక మంచి పని కోసం శ్రమించిన మంచి మనిషిని అన్నానే అని తన మనసులో నొచ్చుకుంది మాణిక్యం.

"ఇంటికెడదామా అమ్మగారూ?", అడిగాడు ముత్యాలు.

"ఊఁ!", అంది మాణిక్యం.

ముత్యాలు మెల్లిగా రిక్షాను జీదలవాడనుండీ తీసుకెడుతూ ఉండగా రోడ్డు పక్కగా ఒక కుటుంబంవారు నిలబడి రిక్షాను ఆపారు. ఆ ఆపినవారు రాము,రమ అనే దంపతులు. వారి చంకలో నాలుగునెలల చంటి పిల్లలు ఇద్దరున్నారు. వాళ్ళు కవలలు. వారి పక్కన రాము, రమ తల్లిదండ్రులు కూడా ఉన్నారు.

రాము మాణిక్యం దగ్గరకొచ్చి,"నమస్కారమమ్మా! మీరు ఇవాళ మా వాడకు రావడం మా అదృష్టం!", అన్నాడు.

"నాదేముంది బాబూ! అంతా మా వారివల్లేకదా!", అంది మాణిక్యం మొహమాటంగా.

"అయ్యగారు చెయ్యగలిగారంటే అది పూర్తిగా మీ వల్లనేనమ్మా! అయ్యగారు చూపించిన దారి మా ఇరు కుటుంబాలనూ నిలబెట్టింది. లేకపోతే మేమంతా ఏమైపోయుండేవాళ్ళమో! అక్షరంముక్క రాని నన్ను అయ్యగారు చేరదీసి చదువు నేర్పి పరీక్షలు రాయించి మంచి ఉద్యోగంలో చేరేందుకు అన్ని విధాలా నాకు ప్రోత్సాహసహకారాలను అందించారు. నన్ను ఇష్టపడిన రమతో దగ్గరుండి నా వివాహం జరిపించారు. ఇదిగో! మాకు ఈ ఇద్దరు మగపిల్లలు కలిగారంటే వారి దీవెనలవల్లేనమ్మా!", అన్నాడు రాము.

అంతలో రమ మాణిక్యం దగ్గరకు వచ్చింది. ఇద్దరు పిల్లలూ ఎంతో ముద్దుగా ఉన్నప్పటికీ రమ చేతిలోని బాబు మరింత ముద్దుగా అనిపించాడు మాణిక్యానికి. అసలే పసివాళ్ళంటే మాణిక్యానికి ప్రాణం! రమ చేతిలోని పిల్లాడు మాణిక్యాన్ని చూస్తూనే బోసినవ్వులు చిందించి మాణిక్యంవైపు ఒరిగాడు. వెంటనే మాణిక్యం వాడిని ఎత్తుకుని,"ఎంత ముద్దుగా ఉన్నాడో!", అంటూ గుండెలకు హత్తుకుంది.

అప్పుడు రమ," అమ్మా! మీరు తల్లి కావాలని తపిస్తున్నారని నాకు తెలుసు. ఈ బాబుని మీరు దత్తత తీసుకోండమ్మా! మీరే పెంచుకోండి!", అంది.

అది విని అమితాశ్చర్యంతో, "ఏమిటీ?? ఏమంటున్నావమ్మా? నిన్ను వదిలి పసివాడు నా దగ్గరెలా ఉంటాడు? అయినా అది సరైన ఆలోచన కాదు!", అంది మాణిక్యం.

"అమ్మా! మీరలా అనొద్దు. అయ్యగారు మాకు చేసిన దానికి ఆయనకు మేమింతకన్నా ఏమివ్వగలమమ్మా? దయచేసి ఒప్పుకోండి. మాకు ఎటు తిరిగీ ఇద్దరు పిల్లలను పెంచే స్థోమత లేదు. మీ వద్ద బాబు పెరిగితే వాడు అయ్యగారులాంటి ఉత్తముడవుతాడని మా నమ్మకం! కాదనకండమ్మా!", అన్నాడు రాము.

"నేను ఒకసారి మావారితో మాట్లాడి మా నిర్ణయం చెబుతాను", అంటూ తన చేతిలోని బిడ్డను రమకు అందివ్వబోయింది మాణిక్యం. కానీ ఆ పసివాడు మాణిక్యం మెడలోని గొలుసులను గట్టిగా పట్టుకుని ఏడవటం మొదలుపెట్టాడు.

"చూశారా అమ్మా? బాబు కూడా మీతోటే వస్తానంటున్నాడు! అయినా మీరు మా అందరికీ అమ్మ. మీవద్ద మా పిల్లాడుంటే అది మా అదృష్టం!", అంది రమ తల్లి.

అతి కష్టం మీద బాబుని రమకు అందించింది మాణిక్యం. ముత్యాలు ఇంటికి బయలుదేరాడు.

ఏమిటో ముత్యాలూ! అంతా కలలా ఉంది! ఈ ప్రాంతంవారి గురించి హీనంగా అనుకోవడం నాదే తప్పు! వారి ఇళ్ళు ఇరుకేమోగానీ వారి మనసులు కాదు! వారు పేదవారేనేమోకానీ వారు నాపై చూపిస్తున్న ప్రేమ మాత్రం చాలా గొప్పది! అసలు వారిని చూడటానికి సైతం ఇష్టపడని నేను వారి బిడ్డను ఎత్తుకుని చెప్పలేని ఆనందం పొందగలిగానంటే నాకే నమ్మబుద్ధి కావడం లేదు! మావారు చేసిన పనులకు అందరూ నన్ను ఇంత గౌరవించడం నాకు చిత్రంగా ఉంది!", అంది మాణిక్యం.

దానికి ముత్యాలు,"అమ్మా! నేను కూడా బీదలవాడకు చెందినవాడినే! నాకు ఈ రిక్షా కొనిపెట్టి ఉపాధిని కల్పించారు అయ్యగారు! మీరంటే అయ్యగారికి ప్రాణమమ్మా! ఎప్పుడూ మీ గురించే ఆలోచిస్తారు. మీరోసారి మా బీదలవాడను చూసి ఇక ఆ దిక్కుకేసి రానని అసహ్యించుకున్నారట. మీకారోజు కష్టం కలిగిందని ఇంత పెద్ద పనిని తన భుజాలపైన వేసుకుని మా బీదలవాడను, మమ్మల్నీ ఉద్ధరించారమ్మా అయ్యగారు! మా బీదలవాడ పేరును మాణిక్యపురంగా మార్చాలని అయ్యగారు అనుకుంటున్నారు! అందుకే మా అందరికీ మీరంటే అభిమానం! మీరు పిల్లలకోసం కలవరిస్తున్నారని అయ్యగారు మాతో ఎన్నోసార్లు చెప్పారు. రమ గర్భవతి కాగానే తనకు పుట్టబోయే బిడ్డను మీకు ఇచ్చేద్దామని అనుకుంది. అనుకోకుండా భగవంతుడు వాళ్లకి కవలపిల్లలను ఇచ్చాడమ్మా! ఇక మీకు పిల్లలు లేరన్న బెంగలేదు! త్వరలో ఆ పసివాడు మీ బిడ్డడై మిమ్మల్ని 'అమ్మా' అని పిలుస్తాడు! ఆ మాటకొస్తే మేమంతా మీ పిల్లలమే! మా కోసం తిరిగితిరిగి అయ్యగారు ఆరోగ్యం పాడుచేసుకున్నారు. మీరు ఇవాళ సరుకులకు వెళ్లాల్సొస్తుందని అయ్యగారు ముందే ఊహించి మిమ్మల్ని బజారుకు జాగ్రత్తగా తీసుకునివెళ్ళి తెచ్చే బాధ్యతను నాకు అప్పగించారు", అని అన్నాడు.

అది విన్న మాణిక్యానికి నోట మాట రాలేదు! అంతలో ఇల్లు వచ్చింది.

మాణిక్యం రిక్షా దిగి రివ్వున ఇంట్లోకి వెళ్ళి పడకగదిలో పడుకుని ఉన్న ముకుందరావు కాళ్లపైపడి, "నన్ను క్షమించండి! మీరు మనిషి కాదు మనీషి అని నాకు ఇవాళే తెలిసింది!", అంటూ ఏడ్చేసింది.

ముకుందరావు లేచి మాణిక్యాన్ని దగ్గరకు తీసుకుని, "నేను ఇంత పెద్ద పనిని తలపెట్టడానికి నాకు స్ఫూర్తినిచ్చింది నువ్వే మాణిక్యం! బీదలవాడ మీదుగా మనం వెడుతున్నప్పుడు నువ్వు పడుతున్న కష్టం చూడలేక నేను అక్కడి పరిస్థితులను ఏమన్నా బాగుచెయ్యగలనేమో చూడడానికని వెళ్లాను. అక్కడివారు పడుతున్న కష్టం నా గుండెను కరిగించింది. మనిషిగా పుట్టినందుకు సమాజానికి ఉపయోగపడేటట్టు ఏదో ఒక మంచిపని చెయ్యాలన్న సంకల్పంతో నాకు తోచిన విధంగా వారికి మేలును కలిగించే పనులు చేశాను! ", అంటూ మాణిక్యం కన్నీరును తుడిచి ఆమెను ప్రేమగా కౌగలించుకున్నాడు ముకుందరావు!

AITA
AITA CONSULTING SERVICES INC.
AI/ML/RPA || ANALYTICS || IOT || CLOUD || INTEGRATION
NORTH BRUNSWICK NJ, WWW.AITACS.COM
732-658-5164 x400,HR@AITACS.COM

తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

**New Jersey**

**Sunday, September 13th at 11:00 AM EST**

isha

# Meditation for Mental Health

## by ISHA FOUNDATION

*Learn Simple tools to create mental balance and*
*inner peace including Isha Kriya,*
*a Powerful meditative process for health, dynamism and wellbeing.*

## Staying Healthy during a pandemic and beyond



by
**Sunita Kanumury,** MD FACAAI

**Please register for the event at our website www.tfasnj.org**

**For additional information:**

| | | | | | |
|---|---|---|---|---|---|
| Sreedevi Jagarlamudi | 732-470-7055 | Bindu Yalamanchili | 908-240-3167 | Usha Darisipudi | 732-718-4184 |
| Jyothi Gandi | 732-208-9599 | Anuradha Para | 201-312-5335 | Anuradha Dasari | 908-907-1502 |
| Srinivas Cheruvu | 732-447-6686 | Yasoda Dasika | 908-304-3710 | Ravi Annadanam | 917-355-5503 |

*Sponsors*



COLDWELL BANKER | REALTY
Raymond E. Uman, Realtor
302 Route 202/206, Bedminster, NJ 07921
Cell: 201-921-4395, Office:908-658-9000
Email : raymond.uman@cbmoves.com

*Media Support :*

mana tv HD, TV5 NEWS, TV9, TVASIA TELUGU HD, SUNRISE TV, GNN, GK TV, TELUGU NRI RADIO

## నేను ఒంటరిని కాను

### పూర్ణిమ

★భరించాను... భరించాను★
ముత్తైదువల నోటి తో ఈసడుంపులు భరించాను

★చూసాను చూసాను!!★
ఒంటరినని కామం తో
చూసిన క్రూరమృగాల
పాడు చూపులు చూసాను

★విన్నాను విన్నాను!!★
★ఒంటరి దానికి డబ్బులెక్కడివి...?★
అని గుసగుస లాడిన చెవులు కోలికే మాటలు విన్నాను

★సహించాను... సహించానా!!★
నష్ట జాతకురాలినని అసహ్యించుకున్న
సమాజాన్ని సహించాను

★ఇక వినేది లేదు... చూసేది లేదు★
★సహించేది లేదు భరించేదీ లేదు★

పడుపు వృత్తి కి దిగమన్నారు
కడుపు నిండుద్ది రమ్మన్నారు
చెయ్యి పట్టిన రాక్షసమూకలని
ముక్కలు ముక్కలు చేసే దాకా ఆగేది లేదు!!

★ఏమీ సాధించలేనన్నరు★
నడిరోడ్డు మిద నెట్టారు

బంగారు పథకాన్ని తెస్తాను
★సాధించి నేనేంటో చూపిస్తాను★

అంతవరకు
అలిసేది లేదు సొలిసేది లేదు

★సాధిస్తాను... సందిస్తను★
నా జీవితం దురదృష్టం కాదని
కష్ట పడి నిరూపిస్తాను
అనుకుంటే
ఏదయినా సాధించగలనని
నిలబడతాను... నిరుపిస్తాను

★ఒంటరి కాను★
★నేను ఒంటరి కాను★
★ధైర్యం తోడుంది నాకు★

ఒంటరి కాను
నేను ఒంటరి కాను
★విజయం తోడుంది నాకు★

★ఒంటరి కాను నేను★
★ఒంటరి వాళ్లకు స్ఫూర్తిని నేను★

★★★★★★★★★★

---

## శిలాకుసుమం

### ఘాలి లలిత ప్రవల్లిక

కాలం ఒడిలోకి జారిన
జ్ఞాపకాల రత్నాలను ఏరుకోవాలని
మనోసీమలోకి అడుగుపెట్టా

సున్నిత భావవీచికలు
నా మేనును అలవోకగా స్పృశించాయి
మధురపరిమళాలఅనురాగపుటత్తరులు
నానాసికాగ్రములో నాట్యం చేసాయి

అభిమానాల తుంపరల్లో
పులకించింది నా మనస్సు ◌.

శ్వేతకమలాల తోరణాలు కట్టిన
చెడుబిందువులనంటనీయని ◌
ఆ వాకిట్లోకి తొంగిచూసా ◌

స్వార్థపుగాలిచొరబడకుండా
మూసిన తలపుల లొంతరు
ఆవెలుగులలో మమకారపు కాంతులు

ధన ఆశల శలభాలను భస్మం చేసే
మహోన్నత సుందర దివిటీలు

ఆనందంతో తడిసిన యదపుష్పాలు
స్నిగ్ధంగా ....సుందరంగా .......

ఆ అనుభూతిని మింగేస్తూ
నేటి పరిస్థితుల తుఫానుగాలులు
ఒక్కసారిగా నాలో మనిషిపై విరుచుకుపడ్డాయి ...!
కాలం ఉరుములు ........సమస్యల పిడుగులు ....

అవినీతి పెనుగాలికి కూలిన నీతివృక్షాలు
కృత్రిమపుమెరుపువెలుగులలో .....
మెరుస్తూ కనిపించేపుత్తడిని కబళించిన ఇత్తడి

నకిలీ వర్ణానికి విలసే రాతిపుష్పాలైన జీవితాలు
స్వచ్ఛతనుకోల్పోయి ....
రూప గాంభీర్యముతో ఆకర్షించే
వాసనలేని పువ్వులు
నేటిసమాజతోటలో విలసే
నాగరిక మానవ కుసుమాలు

తెలిసినా ఆ ఆకర్షణాప్రవాహంలో
కొట్టుకుపోయినేనూ

ఓరాతిపుష్పానయ్యా
కనువిందు చేసే కృత్రిమసొగసులతో

తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

**New Jersey**

*In Association with*

## New York Telangana Telugu Association

సంయుక్తంగా నిర్వహించు

## సురభి నాటక ప్రదర్శన

# శ్రీ కృష్ణ తులాభారము

by భానోదయ నాట్య మండలి

**Date: Sunday, November 22nd**

**Time: 11:00 AM EST**

**Watch live on: /tvasiatelugu**

https://www.youtube.com/watch?v=ltMyYh6BZ2o&ab_channel=TVASIATELUGU







**Free Entry**

అందరూ ఆహ్వానితులే

**For additional information:**

| | | | | | |
|---|---|---|---|---|---|
| Sreedevi Jagarlamudi | 732-470-7055 | Bindu Yalamanchili | 908-240-3167 | Usha Darisipudi | 732-718-4184 |
| Jyothi Gandi | 732-208-9599 | Anuradha Para | 201-312-5335 | Anuradha Dasari | 908-907-1502 |
| Srinivas Cheruvu | 732-447-6686 | Yasoda Dasika | 908-304-3710 | Ravi Annadanam | 917-355-5503 |
| Srinivas Guduru | 917-547-5844 | Dr. Rajender Jinna | 718-216-9920 | Rama Kumari Vanama | 917-821-3561 |

**Donations are accepted**

Please come forward to support these artists in these difficult times, Thank you!

*Media Support :*

## శ్రీ కృష్ణ తులాభారం—TFAS మరియు NYTTA సమర్పణ

### భానోదయ నాట్య మండలి సురభి కళాకారులచే




తెలుగు కళా సమితి వారు న్యూయార్కు తెలంగాణా తెలుగు సమితి తో సంయుక్తముగా, శ్రీ కృష్ణ తులాభారం నాటికను, భానోదయ నాట్య మండలి సురభి కళాకారులతో నవంబర్ 22 నాడు వర్చువల్ ఈవెంట్ గా నిర్వహించారు. TFAS యూట్యూబ్ ఛానల్, TV Asia యూట్యూబ్ ఛానల్ ద్వారా 1200 కు పైగా వీక్షకులు తిలకించిన ఈ నాటిక అందరినీ మంత్రముగ్ధులను చేసింది.

మొదటగా TFAS అధ్యక్షురాలు శ్రీదేవి జాగర్లమూడి అందరినీ స్వాగతించారు. TFAS కార్యదర్శి ఉష దరిసిపూడి, వైస్ ప్రెసిడెంట్ బిందు యలమంచిలి, కోశాధికారి జ్యోతి గండి , కమ్యూనిటీ Chair రవి అన్నదానం, IT Chair అనురాధ దాసరి, మెంబర్షిప్ Chair శ్రీనివాస్ చెరువు, Anual Events ఛైర్ అనురాధ పారా, Youth ఛైర్ యశోద దసిక, TFAS Advisor హరి ఎప్పనపల్లి, న్యూయార్కు తెలంగాణా తెలుగు సమితి ప్రెసిడెంట్ శ్రీనివాస్ గూడూరు గార్లను ఆహ్వానించారు.

ఈ కోవిడ్ కష్ట కాలములో కళాకారులు ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులను వివరిస్తూ శ్రీదేవి మరియు శ్రీనివాస్ గూడూరు గారు దాతల సహాయ సహకార్మములను అర్థించారు. సురభి సంస్థ నిర్వాకులు నాగుబాబు గారిని శ్రీదేవి ఆహ్వానించారు.

తర తరములగా ఈ పద్య నాటిక ప్రక్రియను నమ్ముకున్న కుటుంబముల గురించి నాగుబాబు గారు వివరిస్తూ, ముందు తరములను రంజింప చేయుటకు కూడా సురభి కుటుంబములోని బాల కళాకారులు సిద్ధముగా ఉన్నారని వివరిస్తూ, ఇంతటి మహత్తర కార్యక్రమునకు చేయూత ఇస్తున్న TFAS, NYTTA సంస్థలకు కృతజ్ఞతలు తెలియచేసారు.

IT Chair అనురాధ దాసరి సాంకేతిక పర్యవేక్షణలో 2 గంటల పాటు సాగిన శ్రీ కృష్ణ తులాభారం నాటిక వీక్షకులకు ఒక దృశ్య కావ్యముగా ఎంతగానో అలరించింది. వీక్షించిన ప్రేక్షకులు చక్కని ప్రసంశలు కురిపించారు. ఎందరో దాతలు విరాళములు అందించుటకు ముందుకు వచ్చారు.

శ్రీదేవి ఒక అద్భుత కార్యక్రమము తిలకించిన ఆనందముతో సురభి కళాకారులను ప్రశంసిస్తూ.. కళాకారులకు ఉపయుక్తమయే ఇటువంటి కార్యక్రమములు ముందు ముందు TFAS చేపడుతుందని చెబుతూ... సాటి బృందమును, శ్రీనివాస్ గూడూరు గారు, TFAS Advisor హరి ఎప్పనపల్లి గారి మరియు దాతల అభిప్రాయములు కోరారు.


శ్రీనివాస్ గూడూరు గారు ప్రతీ ఫ్రేమ్ లో ఒక richenss చూపిస్తూ దృశ్య కావ్యమును అందించిన కళాకారులను, కార్యక్రమము చేయుటకు ముందుకొచ్చిన TFAS కు ధన్యవాదములు తెలియచేసారు.

హరిగారు ఇంత చక్కని కార్యక్రమును అందించిన TFAS బృందమును అభినందించారు. ఇటువంటి కార్యక్రమములు ముందు ముందు చేయాలనీ, ప్రపంచ వ్యాప్తముగా ఉన్న కళాకారులను ప్రోత్సహహించాలని కోరారు. TFAS Past President దాము గేదెల గారు సురభి నాటికకు చక్కని వేదికను అందించిన శ్రీదేవి, శ్రీనివాస్ గార్లను అభినందించారు.

TFAS బృందం జ్యోతి గండి, యశోద దసిక , అనురాధ దాసరి, అనురాధ పారా ఒక దృశ్య కార్యక్రమము అందించిన సురభి కళాకారులను అభినందించారు. చిన్ననాటి స్మృతులలోకి వెళ్లిపోయామని ప్రతీ ఒక్కరు అభిప్రాయపడ్డారు. దాతలు ప్రతీ ఒక్కరు ఇంత చక్కని కార్యక్రమమునకు అందించిన TFAS బృందమునకు అభినందనలు తెలియచేసారు.




TFAS బృందము నుంచి దాతలు రవి అన్నదానము, బిందు యలమంచిలి, శ్రీనివాస్ చెరువు గార్లు ఒక మంచి కార్యక్రము ద్వారా కళాకారులకు చేయూత అందించటంలో భాగము అయినందుకు ఎంతగానో గర్వముగా ఉందని అభిప్రాయపడ్డారు.




చివరిగా TFAS కార్యదర్శి ఉష దరిసిపూడి ' పద్యము తెలుగు వారి ఆస్తి' అనీ, ఆ పద్య ప్రక్రియను కాపాడుటకు TFAS మరియు NYTTA ముందుకురావడం ముదావహం, ఇందులో ఒక భాగం కావడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అద్భుతమైన నాటికను ప్రదర్శించినందు భానోదయ నాట్య మండలిని, సురభి కళాకారులను పేరు పేరునా ప్రశంసించారు. NYTTA బృందమునకు, శ్రీనివాస్ గూడూరుగారికి, హరి ఎప్పనపల్లి గారికి, సాటి బృందమునకు, మీడియా పార్టనర్స్ TV Asia, MANA TV, Sunrise TV వారికి, దాతలకు, కార్యక్రమమును వీక్షించిన వారికి ధన్యవాదములు తెలియ చేస్తూ వందన సమర్పణ గావించారు.

**TFAS Secretary**

**ఉష దరిసిపూడి**

# అపర ధన్వంతరి

## మోపిదేవి విజయగోపాల్

నేను యింటికి రాను
తాడో పేడో తేలేవరకూ
ప్రాణం ఎందుకు భయపడాలి చావుని చూసి
వైద్యుడు ఎందుకు భయపడాలి రోగాన్నిచూసి
నన్ను నేను కాపాడుకోడానికి
యింటిలో దాక్కుని వుండాలా?
లక్ష్మణరేఖలు నాకు కాదు
నువ్వు యింటి గుమ్మం లోపలే వుండు
ఇద్దరు పిల్లలనీ జాగ్రత్తగా చూసుకో
అమ్మకి నేను లేని లోటు రానీయకు
వయసుమళ్ళినవాళ్ళంటేనే కరోనాకు యిష్టమట!
నా గురించి మీరేం భయపడవద్దు
దాన్ని అదుపులో పెట్టగల పద్ధతులన్నీ నాకు తెలుసు
ఒక్కొక్క జీవితంలో ఎప్పుడో కాని
యిలాంటి సవాలు క్షణాలు రావు
ఈ సవాలుని స్వీకరించనీ
యిది తపస్సనుకో యజ్ఞమనుకో యుద్ధమనుకో
చెయ్యవలసిన పని చేసి తీరవలసిందే!
తెల్లకోటుతోమెడలోస్టెత్ తో ప్రమాణం చేసాను
ఏ ప్రలోభానికీ లొంగకుండా
దేనికీ భయపడకుండా వైద్యధర్మం నిర్వర్తిస్తానని
ఈ ప్రభుత్వాలు ఈ నాయకులూ
ఈ ప్రగల్భాలు ఈ సింహాసనాలూ
రక్షిస్తాయా మృత్యుశయ్యమీది మనిషిని?
మూర్ఖులు కొంతమంది
మా మీదా రాళ్ళు రువ్వచ్చు
వాళ్ళే ఊపిరి బంధిస్తే మోకాళ్ళమీద నడిచి
మా కాళ్ళదగ్గరి కొస్తారు
అలాంటి వాళ్ళనికూడా మేం అక్కున చేర్చుకుని
వాళ్ళ మృత్యుభయం పోగొడతాము
శత్రువు మన చుట్టూ తిరుగుతున్నాడు
యిపుడు ఆలోచించుకోడానికి
వాదించుకోడానికీ సమయంలేదు
నేరుగా యుద్ధరంగంలోకి దిగాల్సిన క్షణం
నాలో వున్న సైనికుణ్ణి నిద్రలేపాను నేను
నువ్వూ వీరపత్నివి కా!
రక్తం తిలకం దిద్దు
అజేయుణ్ణి నేను విజయంతో తిరిగొస్తాను
కరోనా కాలకూట విషాన్ని కుత్తుక లోనే
బంధిస్తాను
అపర ధన్వంతరి గా నిలుస్తాను!!






Contact me about a career that can better your financial future while helping others with theirs.

**Thevan Theivakumar**
**Executive Partner**
CLF®

**Phone:** (732) 744-3763
**Cell:** (732) 319-8758
ntheivakuma@ft.newyorklife.com

**New York Life Insurance Company**
379 Thornall Street
8th Floor
Edison, NJ 08837

DIVERSITY JOURNAL 2016 DIVERSITY LEADER AWARD
BEST PLACES TO WORK 2017 for LGBT Equality 100% CORPORATE EQUALITY INDEX
training TOP 125

To learn more about our awards and recognition visit: www.newyorklife.com

SMRU1694783 (Exp. 9/30/2018) EOE M/F/D/V/SO

Insure. Prepare. Retire.

**Be good at life.**

NEW YORK LIFE